తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
ఆదివారం
23 ఆగస్టు 2026

# ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు..!



- పప్పులు, వంటనూనెలు సహా మండుతున్న నిత్యావసరాల ధరలు
- ధరల దూకుడు.. ఇంటి బడ్జెట్ రెట్టింపు సామాన్యుడి ఉక్కిరిబిక్కిరి

**కోహిర్, ఆగస్టు 21(జనంసాక్షి):** నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బియ్యం, పప్పులు, వంటనూనెలు, ఉప్పు, కూరగాయల ధరలు ఇప్పటికే పెరగడంతో నెలవారీ వంటింటి బడ్జెట్ తలకిందులవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి సరుకుల ఖర్చు గతంతో పోలిస్తే గణనీయంగా పెరిగిందని, జీతాలు మాత్రం అదే స్థాయిలో ఉండటంతో కుటుంబ నిర్వహణ భారంగా మారిందని చెబుతున్నారు.

పొద్దున లేవగానే ఉపయోగించే టూత్‌పేస్ట్ నుంచి వంటింట్లోని బియ్యం, పప్పులు, నూనెల వరకు ధరల పెరుగుదల ప్రభావం కనిపిస్తోంది. ఉదయం తాగే టీ నుంచి ఇంట్లో ఉపయోగించే ఎలక్ట్రానిక్ వస్తువుల వరకు ప్రతి వస్తువుపైనా ధరల మోత వినిపిస్తోంది. దీంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు అవసరమైన వస్తువులు కొనుగోలు చేసేందుకు కూడా ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**ఎలక్ట్రానిక్ వస్తువులపై కూడా భారం...**

నిత్యావసరాలకే పరిమితం కాకుండా మొబైల్ ఫోన్లు, టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషిన్లు తదితర ఎలక్ట్రానిక్ పరికరాల ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. వస్త్రాలు, గృహోపకరణాలు, కార్ల ధరలు సైతం పెంచేందుకు పలు కంపెనీలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. కొన్ని కంపెనీలు ఇప్పటికే ధరల పెంపును ప్రకటించగా, మరికొన్ని సంస్థలు ధరల సవరణపై కసరత్తు చేస్తున్నాయి.

**పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు...**

ముడిసరుకుల కొరత, రవాణా, ప్యాకింగ్ తదితర వ్యయాలు పెరగడంతో ఉత్పత్తి వ్యయం భారంగా మారిందని కంపెనీలు పేర్కొంటున్నాయి. ఈ అదనపు భారాన్ని పూర్తిగా తమపై మోపకుండా వినియోగదారులకు కొంత



మేర బదలాయించాల్సి వస్తోందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. పశ్చిమాసియా సంక్షోభం, రూపాయి విలువలో మార్పులు, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిసరుకుల ధరల హెచ్చుతగ్గులు వంటి అంశాలు కూడా ధరలపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొంటున్నారు.

**పరిమాణం తగ్గించి.. ధర పెంచే యోచన**

ధరలను నేరుగా పెంచడంతో పాటు కొన్ని ఉత్పత్తుల పరిమాణాన్ని తగ్గించి అదే ధరకు విక్రయించే విధానాన్ని కూడా కంపెనీలు పరిశీలిస్తున్నట్లు మార్కెట్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దీంతో వినియోగదారులపై పరోక్షంగా మరింత భారం పడే అవకాశం ఉంది.

ధరల పెరుగుదలకు అడ్డుకట్ట వేసి, నిత్యావసర వస్తువులను సామాన్యులకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎస్ఐఆర్‌పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి: కలెక్టర్

- అర్హులైన ఏ ఒక్కరి ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు - మీడియాదే కీలక పాత్ర
- జిల్లాలో 1,15,851 మంది ఓటర్లకు నోటీసులు
- క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న బీఎల్‌వోల ప్రక్రియ



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 22 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్, ఆగస్టు 22: జిల్లాలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడంలో మీడియా ప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ కోరారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు హక్కు కోల్పోకుండా చూడటమే ఎస్ఐఆర్ ప్రధాన లక్ష్యమని, అపోహలు, అనుమానాలకు తావులేకుండా వాస్తవ సమాచారాన్ని ప్రచారం చేయాలని సూచించారు.

కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో 880 పోలింగ్ కేంద్రాలు ఉండగా ప్రస్తుతం 910 కేంద్రాల పరిధిలో ఎస్ఐఆర్ కొనసాగుతోందన్నారు. 2002 నాటి ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకుని వివరాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. 2002 జాబితాతో మ్యాపింగ్ కాని 13,216 మంది, ఎన్‌మరేషన్ ఫారాల వివరాల పరిశీలనలో మరో 1,02,635 మంది కలిపి మొత్తం 1,15,851 మంది ఓటర్లను గుర్తించినట్లు చెప్పారు. వీరికి నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు.

**నోటీసు అందినంత మాత్రాన ఓటు తొలగింపు కాదు...**

నోటీసు అందినంత మాత్రాన ఓటు తొలగించినట్లు కాదని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హతను నిర్ధారించుకునేందుకు అవకాశం కల్పించేందుకే నోటీసులు ఇస్తున్నామని తెలిపారు. ఓటర్లు తమ పేరు, చిరునామా, వయస్సు తదితర వివరాలను పరిశీలించుకుని, తప్పులుంటే నిబంధనల ప్రకారం సవరణలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.


నోటీసు అందుకున్న వారు సూచనల ప్రకారం అవసరమైన పత్రాలను స్వీయ ధ్రువీకరణతో సమర్పించాలన్నారు. జనన తేదీ, జనన స్థలం ఆధారంగా అవసరమైన సందర్భాల్లో తల్లిదండ్రుల వివరాలను ధ్రువీకరించే పత్రాలు కూడా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. సందేహాలుంటే బూత్ లెవల్ అధికారులను (బీఎల్‌వోలు) సంప్రదించాలని సూచించారు.

ఎస్ఐఆర్‌పై తప్పుడు సమాచారం, అసత్య ప్రచారానికి తావులేకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే మీడియా ప్రచారం చేయాలని కలెక్టర్ కోరారు. అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు, మీడియా సమన్వయంతో పనిచేసినప్పుడే ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తవుతుందని ఆయన పేర్కొన్నారు.

## డ్రగ్ ఫ్రీ జిల్లాగా వనపర్తిని తీర్చిదిద్దాలి

- మెడికల్ షాపుల్లో అక్రమంగా ప్రమాదకర మందుల విక్రయంపై కఠిన చర్యలు
- జాతీయ రహదారులపై ఆక్రమణలు, అనధికార పార్కింగ్‌ను అరికట్టాలి
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

మిగతా 8లో..



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 22 (జనంసాక్షి):**
జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగానికి పూర్తిగా అడ్డుకట్ట వేసి వనపర్తిని డ్రగ్ ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దేందుకు కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ డి. సునీతారెడ్డితో కలిసి ఎన్‌కార్డ్ కమిటీ, రోడ్డు భద్రత టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలను సమీక్షించారు. ముఖ్యంగా డిగ్రీ కళాశాలలు, మెడికల్ కళాశాల, జేఎన్‌టీయూ తదితర విద్యాసంస్థలపై ప్రత్యేక నిఘా ఉంచాలని కలెక్టర్ సూచించారు.

## 7 సన్నరకం వరి ఉత్పత్తికి ప్రభుత్వం ఆదేశాలు

- జిల్లా వ్యవసాయ అధికారి సక్ర నాయక్

**నారాయణపేట జిల్లా బ్యూరో ఆగస్టు 22(జనంసాక్షి):** వానాకాలం 2026 పంట కాలంలో ఏడు సన్న రకాల వరి విత్తనాలను తెలంగాణ ప్రభుత్వము సాగు చేయాల ని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని జిల్లా వ్యవసాయ అధికారి సక్ర నాయక్ తెలిపారు. ఈ సన్న రకాలు వరి వొడ్లను ప్రభు త్వము కొనుగోలు కేంద్రల ద్వారా మద్దతు ధరకు కొను గోలు చేసి ఒక క్వింటాలుకు 500 రూపాయలు బోనస్ ఇవ్వడం జరుగుతుంద న్నారు. అందువలన రైతు లు సాగు చేసుకున్న ఏడు రకాలు బిపిటి 52 04, ఆర్ ఎన్ఆర్ 15 0 48, కేఎన్ ఎమ్ 16 38, కేఎన్ఎం 7715, జైశ్రీరామ్, హెచ్ఎం టి సోనా మరియు డబ్ల్యూ జి ఎల్ 44 మొదలగు రకాలను సాగు చేసిన రైతులు ఏ దుకాణంలో విత్తనాలు కొన్నారో ఆ దుకాణం దగ్గరి కి వెళ్లి తమ పేర్లను నమో దు చేయించుకోవాలనీలేదా రైతులు తమ సొంత వరి విత్తనాలను విత్తుకున్నట్లయితే వ్యవసాయ విస్తీర్ణ అధికారికి ధ్రువీకరణ పత్రము అందజేయాలనీ తెలిపారు. లేనియెడల ఆన్లైన్లో పేర్లను నమోదు చేయని రైతుల వడ్లను ప్రభుత్వం కొనడానికి వీలు లేదనీ ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని ఆన్లైన్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం

**నవాబ్‌పేట, ఆగస్టు 22 (జనంసాక్షి):**
స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహబూబ్‌నగర్ కోర్టు న్యాయమూర్తి మున్నవర్ హుస్సేన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా పోక్సో (POCSO) చట్టం, సైబర్ నేరాలు, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిరోధక చట్టం, మరియు ర్యాగింగ్ నిరోధక చట్టాలపై విద్యార్థులకు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. సాంకేతికతను మంచి కోసం వాడుకోవాలని, సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు వహించాలని కోరారు. చట్టాలను ఉల్లంఘించకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో




కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజ్ బహదూర్ వెంకటరామిరెడ్డి జీవితం నేటి యువతకు ఆదర్శం

- స్వర్గీయ రాజ్ బహదూర్ వెంకట్రామ రెడ్డి 157వ జయంతి వేడుకలు
- విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీష్ రావు, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి







**సిద్దిపేట, ఆగస్టు 22 (జనంసాక్షి):** స్వర్గీయ రాజా బహదూర్ వెంకట రామిరెడ్డి జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. సిద్దిపేటలోని రెడ్డి సంక్షేమ భవన్‌లో నిర్వహించిన ఆయన 157వ జయంతి వేడుకలు, విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు హరీశ్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ...** ఒక వ్యక్తి తాను మాత్రమే ఎదగడం గొప్పతనం కాదని, తనతో పాటు మరో పది మందిని పైకి తీసుకు రావడమే నిజమైన గొప్పతనమన్నారు. హైదరాబాద్ కోత్వాల్‌గా పనిచేసిన కాలంలోనే భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు, ముఖ్యంగా బాలికల కోసం రెడ్డి హాస్టల్ ఏర్పాటు చేసిన దార్శనికుడు వెంకటరామిరెడ్డి అని కొనియాడారు. ఆయన ఆశయాల స్ఫూర్తితో చదువుకుని ఎదిగిన డాక్టర్ చంద్రారెడ్డి, డాక్టర్ యాదవరెడ్డి, ప్రశాంత్ రెడ్డి వంటి వారు సమాజానికి సేవ చేస్తున్నారని చెప్పారు.

సిద్దిపేటలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో హాస్టల్ లేదా పాఠశాల ఏర్పాటు చేసే ప్రతిపాదనకు తన పూర్తి సహకారం ఉంటుందని హరీశ్ రావు తెలిపారు. ఫంక్షన్ హాల్ ద్వారా వచ్చే ఆదాయాన్ని పిల్లల విద్య కోసం వినియోగించాలని, అందులో 50 శాతం రెడ్డి సామాజిక వర్గంలోని పేదలకు, మిగతా 50 శాతం ఇతర వర్గాల పేద విద్యార్థులకు కేటాయించాలని సూచించారు.

పేద పిల్లల విద్య కోసం రైతు ముక్కిస పాపిరెడ్డి దంపతులు ఏటా రూ.2 లక్షలు విరాళంగా ఇస్తామని ప్రకటించడం అభినందనీయమన్నారు.

సంఘం నూతన అధ్యక్షుడు తిరుమల్ రెడ్డి ఏటా రూ.51 వేలు అందిస్తానని ప్రకటించడం స్ఫూర్తి దాయకమన్నారు.

సంఘాలు కేవలం పదవులకే పరిమితం కాకుండా ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచినప్పుడే వాటికి సార్థకత ఉంటుందని హరీశ్ రావు పేర్కొన్నారు.

## చాకరిమెట్లలో భక్తజనుల పూజలు



**శివ్వంపేట, ఆగస్ట్ 22(జనంసాక్షి):** శ్రావణ మాసాన్ని పరిష్కరించుకొని శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్ల గ్రామ పంచాయతీ పరిధిలోని చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి దేవాలయానికి ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా జంట నగరాల నుంచి తరలివచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో శనివారం దేవాలయంలో ఆంజనేయస్వామి వారిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొంత మంది భక్తులు సత్యనారాయణ స్వామి వ్రత మండపంలో దంపతుల వారీగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించి, వారి మొక్కులు తీర్చుకున్నారు. ఆ తర్వాత రామ మందిరంలో స్వామివారి దర్శించుకొని భక్తులు అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ ఆంజనేయశర్మ, పూజారులు శాస్త్రుల దేవాదత్తు శర్మ, దేవి ప్రసాద్ శర్మ, సిబ్బందితో పాటుగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఉన్నారు.

## గ్రామ అభివృద్ధి పనులపై ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్‌కు సర్పంచ్ సంగమేశ్వర్ పాటిల్ వినతి



**నాగల్గిద్ద, ఆగస్ట్ 21 (జనంసాక్షి):** మనూర్ మండలం తోర్నాల్ గ్రామ అభివృద్ధి పనులపై గ్రామ సర్పంచ్ సంగమేశ్ పటేల్ జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని బీటీ రోడ్డు నిర్మాణంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఇతర అభివృద్ధి పనుల గురించి ఎంపీతో చర్చించారు. గ్రామ ప్రజల అవసరాలను వివరించి, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్ సంబంధిత అధికారులతో మాట్లాడి, పెండింగ్‌లో ఉన్న పనులకు త్వరగా టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తోర్నాల్ గ్రామ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు.

## విద్యార్థులకు ఉచిత యూనిఫారాల పంపిణీ

- మనియార్‌పల్లి సర్పంచ్ రాజ్‌కుమార్



**కోహీర్, ఆగస్టు 22, (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల పరిధిలోని మనియార్‌పల్లి గ్రామంలోని ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచిత యూనిఫారాలను పంపిణీ చేశారు. సర్పంచ్ బ్యాగారి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన స్వయంగా విద్యార్థులకు యూనిఫారాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఉచిత యూనిఫారాలు అందుకోవడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన పీఏసీఎస్ చైర్మన్ ఒగ్గు దామోదర్



**బెజ్జంకి,ఆగస్టు 22,(జనంసాక్షి):** మండలంలోని గుండారం గ్రామంలో ఇటీవల అకాల మరణం చెందిన ఎలకంటి మణెమ్మ,సాన భాగయ్య,గౌరవేణి లక్ష్మి,ఎల్లుమెట్ల లక్ష్మి కుటుంబ సభ్యులను బెజ్జంకి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) చైర్మన్ ఒగ్గు దామోదర్ పరామర్శించి,ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు లింగాల శ్రీనివాస్,మాజీ అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి,సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు గూడెల్లి శ్రీకాంత్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చిలువేరి శ్రీనివాస్ రెడ్డి,రావుల నర్సయ్య,జెల్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారి

- పెసర, పత్తి పంటల పరిశీలన
- పురుగు నివారణపై రైతులకు సూచనలు



**జగదేవ్‌పూర్, ఆగస్టు 22 (జనంసాక్షి):** జగదేవ్‌పూర్ మండల పరిధిలోని అలిరాజపేట గ్రామంలో శనివారం మండల వ్యవసాయ అధికారి యు.వసంతరావు ఆధ్వర్యంలో పంటల క్షేత్ర పరిశీలన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పెసర, పత్తి పంటలను పరిశీలించి, పంటలపై కనిపిస్తున్న పురుగు ఉధృతి, నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. పెసర పంటలో పచ్చ పురుగు ఉధృతి కొంతమేర ఉండడంతో పురుగును తొలి దశలోనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. గుడ్ల సమూహాలు, చిన్న పురుగులను గుర్తించిన వెంటనే సేకరించి నాశనం చేయాలని, పొలాన్ని తరచుగా పరిశీలించాలని చెప్పారు. అవసరమైన చోట పంటకు పురుగుకు అనుమతించబడిన పురుగు మందులను లేబుల్ సూచనల ప్రకారం మాత్రమే వినియోగించాలని తెలిపారు. పురుగుమందులను ఎప్పుడు ఒకే రకం వాడకుండా, వివిధ చర్యల విధానాలు కలిగిన పురుగుమందులను మారుస్తూ వినియోగించడం ద్వారా పురుగు మందుల నిరోధకతను నివారించవచ్చని వివరించారు. అదే విధంగా పత్తి పంటలకు పట్టిన పచ్చ దోమ, తెల్లదోమ పురుగుల కారణంగా ఆకుల అంచులు పసుపురంగులోకి మారడం, ఆకులు ముడుచుకోవడం వంటి లక్షణాలను గమనిస్తూ రైతులు క్రమం తప్పకుండా పంటను పరిశీలించాలని సూచించారు. తెల్లదోమ నియంత్రణకు పొలంలో కలుపు మొక్కలను తొలగించడం, అధికంగా నత్రజని ఎరువులు వాడకుండా సమతుల్య ఎరువుల వినియోగం చేపట్టాలని పేర్కొన్నారు. అవసరమైనప్పుడు పురుగు ఉధృతి చేరినప్పుడు మాత్రమే పత్తి పంటకు నమోదైన సిఫారసు చేసిన పురుగు మందులను సంబంధిత లేబుల్ మోతాదులో ఉపయోగించాలన్నారు. పురుగుమందుల మిశ్రమాలను అనవసరంగా తయారు చేసి పిచికారీ చేయవద్దని పత్తి పంటలో మిత్ర పురుగులను సంరక్షించడం ద్వారా సహజ నియంత్రణకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. అయితే రైతులు తమ పంటలను క్రమం తప్పకుండా పరిశీలించి, పురుగు ఉధృతి పెరిగిన వెంటనే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి సాంకేతిక సలహాలు పొందాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు శరణ్య, సమత, సిరిసిల్ల వ్యవసాయ కళాశాల ఆర్ఏడబ్ల్యూఈపి విద్యార్థులు డింపుల్, మేఘన, అంకిత, సుచిత్ర, నవ్య అలీ రాజపేట గ్రామ రైతులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుపై దాడి చేసిన వారిపై

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర నాయకులు చెల్మెడ అనిల్ కుమార్



**కోహీర్, ఆగస్టు 22 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల పరిధిలోని భూపాలపల్లి జిల్లాలో దళిత జర్నలిస్టు పుల్ల రవీందర్ ఇంట్లోకి చొరబడి దాడికి పాల్పడిన ఘటనను తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం సభ్యులు తీవ్రంగా ఖండించారు.

ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, దాడికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర నాయకులు చెల్మెడ అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. జర్నలిస్టు పుల్ల రవీందర్ ఇంట్లోకి చొరబడి దాడి చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు.

జర్నలిస్టులు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడులకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

దాడి ఘటనపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడికి గురైన జర్నలిస్టుకు రక్షణ కల్పించడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

జర్నలిస్టు పుల్ల రవీందర్‌పై దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం తరపున చెల్మెడ అనిల్ కుమార్ డిమాండ్ చేశారు.

## 8వ వార్డులో డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు హామీ



సదాశివపేట, ఆగస్టు 22 (జనంసాక్షి): 18వ వార్డులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కౌన్సిలర్ బిట్ల నిఖిత ప్రేమ్ మున్సిపల్ చైర్పర్సన్, కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. మున్సిపల్ సాధారణ నిధులతో పనులు చేపట్టాలని కోరారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించి, సమస్యలను పరిశీలించి త్వరలో పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రజల మౌలిక వసతుల కోసం నిరంతరం కృషి చేస్తామని కౌన్సిలర్ తెలిపారు.

## కంది పంటలో సమగ్ర పోషక యాజమాన్యంపై రైతులకు అవగాహన



అల్లాదుర్గం, ఆగస్టు 22 (జనంసాక్షి): మండల పరిధిలోని ముస్లాపూర్ గ్రామంలో రైతు గొల్ల బీర్ల మొగులయ్య పొలంలో కంది పంటలో సమగ్ర పోషక యాజమాన్యం పై నమూనా తీరు రైతులకు అవగాహన కల్పించారు. కంది వేసిన తర్వాత 45 రోజుల పంట దశలో 19:19:19 నీటిలో కరిగే ఎరువును లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున ఆకులపై పిచికారీ చేసే విధానాన్ని రైతులకు ప్రదర్శించారు. సమతుల్య పోషక యాజమాన్యం, సరైన సమయంలో ఆకులపై ఎరువుల పిచికారీ చేయడం ద్వారా పంట ఎదుగుదల మరియు దిగుబడిని మెరుగు పరచవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జె. రాజేష్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు నవనీత, లక్ష్మి మరియు పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు




సంగారెడ్డి, ఆగస్టు 22 (జనంసాక్షి): ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా ఫోటో జర్నలిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్యురే చిత్రపటానికి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ... ఒక్క ఛాయా చిత్రం వేయి పదాల భావాన్ని తెలియజేయగలదని అన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు సమాజానికి ఉపయోగపడే అంశాలను ఫోటో జర్నలిస్టులు తమ కెమెరాల్లో బంధించాలని సూచించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, ఫోటోలు గత సంఘటనలను కళ్లముందు నిలిపే సజీవ సాక్ష్యాలని పేర్కొన్నారు. అనంతరం ఫోటో జర్నలిస్టులను ఘనంగా సన్మానించి, ఫోటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు, ఫోటో జర్నలిస్టులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


## ట్రాక్టర్ బోల్తా బాలుడు మృతి



రేవల్లి, ఆగస్టు 22 (జనంసాక్షి): ట్రాక్టర్ బోల్తా పడి బాలుడు మృతి చెందిన ఘటన రేవల్లి మండలంలోని తల్పునూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన యానమోని కృష్ణకు చెందిన ట్రాక్టర్ పొలం పనులు ముగించుకొని ఇంటికి తిరిగి వస్తుండగా ట్రాక్టర్ బోల్తా పడడంతో కావలి సాయికుమార్ (16) అనే బాలుడు మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం రేవల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కుర్చీ కొత్తది.. పేరు పాతదే..!

- **నూతన ఎంపీడీవో వచ్చినా మారని అధికారుల వివరాల బోర్డు నిర్లక్ష్యంపై స్థానికుల అసంతృప్తి**




కోహిర్, ఆగస్టు 22 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా కోహిర్ మండల పరిషత్ కార్యాలయంలో అధికారుల వివరాల బోర్డు నిర్వహణపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన బోర్డులో ఇప్పటికీ పాత ఎంపీడీవోల పేర్లు, పదవీకాల వివరాలే కనిపిస్తుండగా.. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రస్తుత ఎంపీడీవో పేరు మాత్రం లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

ఎంపీడీవో క్యాబిన్ వద్ద కూడా నూతన అధికారి పేరును ప్రదర్శించకుండా పాత వివరాలే కొనసాగిస్తుండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మారినప్పటికీ కనీసం పేరు, హోదా బోర్డులను సకాలంలో మార్పుకపోవడం కార్యాలయ నిర్వహణలో నిర్లక్ష్యానికి నిదర్శనమని పలువురు విమర్శిస్తున్నారు.

ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చినప్పుడు సంబంధిత అధికారి ఎవరో స్పష్టంగా తెలిసేలా వివరాలు అందుబాటులో ఉండాలని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ కార్యాలయంలోనే అధికారుల వివరాలు అప్‌డేట్ కాకపోతే ఎవరిని సంప్రదించాలనే విషయంలో ప్రజల్లో అయోమయం ఏర్పడే అవకాశం ఉందని అంటున్నారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాత వివరాలను తొలగించి, ప్రస్తుత ఎంపీడీవో పేరు, హోదా, బాధ్యతలు స్వీకరించిన తేదీ తదితర వివరాలను బోర్డుపై వెంటనే ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## విరాహత్ అలీని పరామర్శించిన ఎమ్మెల్యే హరీష్ రావు



జగదేవ్‌పూర్, ఆగస్టు 22 (జనంసాక్షి): టియుడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షుడు ఖాజా విరహత్ అలీని సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీష్ రావు పరామర్శించారు. గత నాలుగు రోజుల క్రితం విరహత్ అలీ తల్లి భాషారత్ ఉన్నిసా బేగం మృతి చెందగా విషయం తెలుసుకున్న హరీష్ రావు శనివారం గజ్వేల్ లో ని విరహత్ నివాసానికి చేరుకొని బాషా రత్ ఉన్నిసా బేగం మృతి పట్ల సంతాపం తెలిపి విరహత్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. హరీష్ రావు వెంట ఎమ్మెల్సీ డాక్టర్ వి.యాదవ రెడ్డి ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ గజ్వేల్ నియోజకవర్గ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి సిద్దిపేట మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కడవెరుగు రాజనర్సు బిఆర్ఎస్ నాయకులు గంగిశెట్టి రవీందర్ బెండ మధు తదితరులు పాల్గొన్నారు.

## దేవుడి దీపం నుంచి మంటలు

- **తృటిలో తప్పిన పెను ప్రమాదం**
- **సిలిండర్ పేలితే భారీ నష్టం**
- **సమయస్ఫూర్తితో యువకుల సాహసం**

గోపాల్పేట, ఆగస్టు 22 (జనంసాక్షి): దేవుడి వద్ద వెలిగించిన దీపం నుంచి మంటలు చెలరేగడంతో ఓ ఇంట్లో పొగలు కమ్ముకున్న ఘటన గోపాల్పేట గ్రామంలో చోటుచేసుకుంది. పక్కింటి యువకులు సమయస్ఫూర్తితో వ్యవహరించి గ్యాస్ సిలిండర్‌ను బయటకు తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పింది.

స్థానికుల వివరాల ప్రకారం.. ఓ కుటుంబంలో ముగ్గురు కుమారులు ఉన్నారు. ముగ్గురు పిల్లలు పాఠశాలకు వెళ్లగా, తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లారు. పాఠశాలకు వెళ్లే ముందు చిన్న కుమారుడు దేవుడి వద్ద దీపం వెలిగించి వెళ్లాడు. అనంతరం ఇంట్లో మంటలు చెలరేగి పొగలు కమ్ముకున్నాయి. పక్కింటి యువకులు ఇంటి నుంచి పొగలు రావడాన్ని ముందుగానే గుర్తించారు. మంటలు మరింత వ్యాపిస్తే ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్‌కు ప్రమాదం వాటిల్లి, చుట్టుపక్కల ఉన్న ఆరు నుంచి ఎనిమిది కుటుంబాల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని వారు భావించారు. దీంతో ఏమాత్రం ఆలస్యం చేయకుండా సమయస్ఫూర్తితో స్పందించారు. ఇంటికి తాళం వేసి ఉండటంతో యువకులు తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించారు.

ముందుగా గ్యాస్ సిలిండర్‌ను గుర్తించి సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అనంతరం స్థానికుల సహకారంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. యువకుల చాకచక్యం, సాహసం కారణంగా పెను ప్రమాదం తప్పడంతో స్థానికులు వారిని అభినందించారు.

## సదాశివపేటలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం



సదాశివపేట, ఆగస్టు 22 (జనంసాక్షి): సదాశివపేటలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సదాశివపేట కాంగ్రెస్ పార్టీ, మున్సిపల్ వ్యవహారాల ఇన్‌చార్జ్ తోపాజి అనంత కిషన్ హాజరై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సీఎం కార్యక్రమం విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కౌన్సిలర్లతో సమావేశమై సదాశివపేట అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యకర్తల సమస్యలను జగ్గారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిసి చైర్మన్ రామ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరంజీవి, బ్లాక్ ప్రెసిడెంట్ సిద్దన్న, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ప్రదీప్, మాజీ వైస్ చైర్మన్ విశ్వనాథం, బీసీ స్టేట్ డైరెక్టర్ పట్నం సుభాష్, జిల్లా జనరల్ సెక్రటరీ అరుణ్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

## ఈ నెల 26న సంగారెడ్డిలో గురువందనం

- **హాజరుకానున్న ఎంపీ, ఎమ్మెల్సీలు**



సంగారెడ్డి, ఆగస్టు 22 (జనంసాక్షి): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) సంగారెడ్డి జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 26న నిర్వహించనున్న గురువందనం కార్యక్రమానికి మెదక్ పార్లమెంట్ సభ్యులు ఎం. రఘునందన్ రావును మర్యాదపూర్వకంగా కలిసి గురు వందనం కార్యక్రమానికి హాజరుకావాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దత్తాత్రి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోట సుధాకర్, రాష్ట్ర కార్యదర్శి రమేష్ కోరారు. ఆగస్టు 26న సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి పిఎస్ఆర్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో 'తపస్' ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన "గురు వందనం" కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్లమెంటు సభ్యులు రఘునందన్ రావు ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు మల్కా కొమరయ్య, సి.అంజి రెడ్డి సామాజిక సమరసత తెలంగాణ కన్వీనర్ అప్పల ప్రసాద్, తపస్ రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్, జిల్లా విద్యాధికారి రోహిణి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వరరావు దేశ్ పాండే, రాష్ట్ర కోశాధికారి భాస్కర్ దేశ్, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కో కన్వీనర్ బసవరాజు, సేవా విభాగం కో కన్వీనర్ చంద్రశేఖర్, ఆడిట్ విభాగం కోకన్వీనర్ విజయ్ కుమార్, సామాజిక మాధ్యమం విభాగం కో కన్వీనర్ నర్సింలుతో పాటు, తపస్ సంగం నాయకులు, ఉపాధ్యాయులు హాజరుకానున్నానట్ల తెలిపారు.

## జుటయ్యకుంట పున నిర్మాణానికై వినతి



బిజినేపల్లి, ఆగస్టు 22(జనంసాక్షి): బిజినేపల్లి మండల కేంద్రంలోని 458 సర్వే నెంబరులోని జుటయ్య కుంట కట్టను పున నిర్మించాలని ఆ గ్రామానికి చెందిన మత్స్య సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తుమ్మల అల్లోజి, గ్రామ పెద్దలు కరిగళ్ల సుదర్శన్, నెల్లికంటి మహేశ్వర్ రెడ్డి, గఫూర్ ఖాన్, గ్రామస్తులు జిల్లా కలెక్టరుకు శనివారం వినతి పత్రం అందించారు. ప్రభుత్వ కట్టను ధ్వంసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని ప్రభుత్వ స్థలాలకు, ఆస్తులకు భరోసా కల్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

# యూరియా, కాంప్లెక్స్ ఎరువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలి

- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట మావో

**చేర్యాల, ఆగస్టు 22 (జనంసాక్షి):** యూరియా,కాంప్లెక్స్ ఎరువులను ఫర్టిలైజర్ షాపుల యజమానులు అధిక ధరలకు విక్రయించకుండా ఎమ్మార్పీ ధరలకే రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట మావో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం చేర్యాల వ్యవసాయ శాఖ ఏడీఏ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ రజినికి రైతు సంఘం కమిటీ ఆధ్వర్యం లో మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా వెంకట మావో మాట్లాడుతూ.. సరైన వర్షాలు లేక పంటలు ఎండిపోతున్న పరిస్థితు ల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని కొందరు ఫర్టిలైజర్ షాపుల యజమానులు యూరియా కొరత ఉందంటూ యాప్‌లో బుక్ చేసుకోవాలని చెబుతూ అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మార్పీ రూ.267 ఉన్న యూరియా బస్తాను రూ.350 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారని, కాంప్లెక్స్ ఎరువులపై కూడా బస్తాకు రూ.200 నుంచి రూ.500 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. యూరియాతో పాటు అవసరం లేని పురుగు మందులు, గుళికలు, ఇతర సరుకులు కొనుగోలు చేస్తేనే ఎరువులు ఇస్తామని రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కొనుగోళ్లకు బిల్లులు ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఫర్టిలైజర్ షాపులను అధికారులు వెంటనే తనిఖీ చేసి, ప్రతి కొనుగోలుకు తప్పనిసరిగా బిల్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ప్రతి షాపులో స్టాక్ బోర్డు, ధరల పట్టికను ఏర్పాటు చేసి, ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించేలా చూడాలని కోరారు. అధికారులు స్పందించకపోతే రైతాంగాన్ని ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రైతులు కూడా రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగే పోరాటాల్లో పాల్గొని తమ హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చేర్యాల పట్టణ రైతు సంఘం కార్యదర్శి నంగి మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

# చుంచనకోటలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు



**చేర్యాల, ఆగస్టు 22 (జనంసాక్షి):** మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శనివారం చుంచనకోట గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గొర్రె శ్రీనివాస్, ఉపసర్పంచ్ వట్టిపల్లి ఆగయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో కేక్ కట్ చేసి అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. చిరంజీవి సేవా కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వడ్లకొండ వెంకటేశం, శ్రీపతి కమలేశ్, మంద వెంకట్ రెడ్డి, పంతం రాజు, పండుగ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# కాళ్లకాల్‌లో షార్ట్ సర్క్యూట్‌తో కిరాణా షాప్ దగ్ధం

- సుమారు లక్ష రూపాయల వరకు నష్టం
- విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కిరాణా ఫాస్ట్ ఫుడ్ షాప్ దగ్ధం





**మనోహరాబాద్, ఆగస్టు 23 (జనంసాక్షి):** మండలంలోని కాళ్ళకల్ గ్రామానికి చెందిన వర్గంటి నాగేష్ కిరాణా మరియు ఫాస్ట్ ఫుడ్ దుకాణంలో విద్యుత్ షాట్ సర్క్యూట్ తో తెల్లవారు జామున మంటలు రావడంతో స్థానికులు ఫోన్ సమాచారం ఇవ్వడంతో వచ్చి చూసేసరికి షాప్ లో ఉన్న సామాగ్రి పూర్తిగా దగ్ధమైనట్లు సుమారు లక్ష రూపాయలు ఆస్తి నష్టం జరిగినట్లు దుకాణం యజమాని నాగేష్ తెలిపారు.

# వ్యక్తి అదృశ్యం కేసు నమోదు



**తెలకపల్లి, ఆగస్టు 22(జనంసాక్షి):** వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండలంలో చోటు చేసుకున్నట్లు స్థానిక ఎస్సై యం.రమేష్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు అందించిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కార్వంగ గ్రామానికి చెందిన జుట్టు నరేష్ (19), తండ్రి పెద్ద కురుమయ్య, నాగర్‌కర్నూల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతూ ప్రభుత్వ ఎస్సీ హాస్టల్‌లో ఉంటున్నాడని, ఈ నెల 18న కాలేజీకి వెళ్లకుండా హాస్టల్ వార్డెన్‌కు సమాచారం ఇచ్చి మధ్యాహ్నం 12 గంటల సమయంలో వారి స్వగ్రామంలోని తమ ఇంటికి వచ్చి స్నానం చేసి మరల తిరిగి హాస్టల్‌కు వెళ్తున్నానని తల్లి లక్ష్మమ్మకు చెప్పి మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో ఇంటి నుంచి బయలుదేరాడు. నరేష్ తిరిగి హాస్టల్‌కు చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి పెద్ద కురుమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఉప్పరి ఇందు కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేత



**ఎర్రవల్లి, ఆగస్టు 22 (జనంసాక్షి):** రెండు నెలల క్రితం కడుపు నొప్పితో గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఎర్రవల్లి గ్రామానికి చెందిన నీట్ విద్యార్థిని ఉప్పరి ఇందు కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచింది.జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ద్వారా మంజూరైన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును ఎర్రవల్లి సర్పంచ్ అనిత కృష్ణసాగర్ శుక్రవారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఇందు కుటుంబ సభ్యులు జిల్లా కలెక్టర్‌కు, సర్పంచ్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కష్టకాలంలో తమకు అండగా నిలిచిన గ్రామ పెద్దలు, యువకులు, సాగర సంఘం పెద్దలు, కుల బంధువులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇందు కుటుంబానికి అండగా ఉంటామని సర్పంచ్ హామీ ఇచ్చారు.

# రాష్ట్రంలో జానపద విశ్వవిద్యాలయం, జానపద అకాడమీ ఏర్పాటు




**సిద్దిపేట బ్యూరో, ఆగస్టు 22 (జనంసాక్షి):** రాష్ట్రంలో జానపద విశ్వవిద్యాలయం, జానపద అకాడమీ ఏర్పాటు చేయాలని సకల కళల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వలస సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో జిల్లా సకల కళల జేఏసీ ఆధ్వర్యంలో ప్రపంచ జానపద దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వలస సుభాష్ చంద్రబోస్ ప్రముఖ ఆశుకవి, తెలంగాణ రాష్ట్ర గీత రచయిత, సిద్దిపేట జిల్లా ముద్దుబిడ్డ అందెశ్రీకి ఘన నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు.7 అనంతరం ప్రముఖ ప్రజాగాయకుడు గద్దర్‌తో పాటు తెలంగాణ సకల కళల పరిరక్షణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు దివంగత మురళీధర్ దేశ్‌పాండేకు నివాళులర్పించారు. **ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ..** "జనం నుంచి వచ్చింది జానపదం. ఒక జాతి నిర్మాణానికి జానపదం మూలం. పల్లెవాసుల గుండెచప్పుడు జానపదం" అని పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడి 13 సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ జానపద విశ్వవిద్యాలయం, జానపద అకాడమీ ఏర్పాటు కాకపోవడం బాధాకరమన్నారు. సిద్దిపేట జిల్లా నుంచి జానపద విశ్వవిద్యాలయం, జానపద అకాడమీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. జానపద కళలు, సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వాన్ని భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న కళాకారుల పెన్షన్లను వెంటనే మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో జానపద కళాకారులు ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి. సీనియర్ కళాకారులను శాలువాలతో సన్మానించారు. అతిథులను జిల్లా కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నూతన సిద్దిపేట జిల్లా సకల కళల జేఏసీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా చైర్మన్‌గా వేముల వీరస్వామి, కన్వీనర్‌గా బత్తుల చంద్రమౌళి, కోఆర్డినేటర్‌గా చింతలపల్లి తిరుపతిరెడ్డిని ఎన్నుకున్నారు. నూతన బాధ్యులకు నాయకులు, కళాకారులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సకల కళల జేఏసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సంకె రాజేష్, రాష్ట్ర కో-కన్వీనర్, జగిత్యాల జిల్లా బాధ్యులు జంగిలి లచ్చన్న, జిల్లా జానపద కళాకారులు బండారుపల్లి శ్రీనివాసులు, సంపత్, వడ్లకొండ స్వామి, స్వామిరావు, జాగిరి రాజు, దండబోయిన కొమురెల్లి, మొగిలి మహేందర్ తిరుపతి తదితరులతో పాటు జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన జానపద, సకల కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అంతరిక్ష సాంకేతికతపై విద్యార్థులకు స్ఫూర్తినిచ్చిన 'చంద్రప్రస్థాన్--2026'



**నర్సాపూర్, ఆగస్టు 22 (జనంసాక్షి):** జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని బి.వి. రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (BVRIT), నర్సాపూర్‌లో **'చంద్రప్రస్థాన్-2026'** పేరుతో రెండు రోజుల సాంకే తిక, విజ్ఞాన కార్యక్రమాన్ని నిర్వహించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బేసిక్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్, SEDS LaunchPad404 స్టూడెంట్ స్పేస్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యా ర్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల్లో అంతరిక్ష సాంకేతికత, ఎంబెడెడ్ సిస్టమ్స్, గ్రహాల అన్వేషణ, భూ వ్యవస్థల శాస్త్రంపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడమే కార్యక్రమ లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు. భారత అంతరిక్ష పరిశోధన రంగంలో సాధించిన విజయాలను విద్యార్థులకు పరిచయం చేస్తూ, అభివృద్ధి చెందుతున్న అంతరిక్ష సాంకేతికతలో వినూత్న పరిష్కారాల రూపకల్పనకు వారిని ప్రోత్సహించారు. చంద్రప్రస్థాన్‌లో భాగంగా సాంకేతిక క్విజ్‌లు, విజువల్ ఛాలెంజ్‌లు, ESP32 ఆధారిత స్వయంప్రేరిత గ్రహ ల్యాండర్ పేలోడ్ ప్రోటోటైపింగ్ ఛాలెంజ్ తదితర పోటీలు నిర్వహించారు. వీటిలో విద్యార్థులు తమ సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించారు. తరగతి గదిలో నేర్చుకున్న సైద్ధాంతిక అంశాలను ప్రాక్టికల్ సమస్యల పరిష్కారంలో అన్వయించుకునే అవకాశం లభించింది.

**సముద్రాలు-వాతావరణంపై నిపుణుల ప్రసంగం...**

రెండో రోజు హైదరాబాద్‌లోని INCOISకు చెందిన సైంటిస్ట్-ఎఫ్ డా. వెంకట్ శేషు రెడ్డి నిపుణుల ఉపన్యాసం ఇచ్చారు. 'సముద్రాలు, వాతావరణం-జీవం మధ్య పరస్పర సంబంధాలు' అనే అంశంపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. సముద్ర పరిశీలన, వాతావరణ అధ్యయనాలు, సముద్ర జీవావరణ వ్యవస్థలు, భూ వ్యవస్థల పర్యవేక్షణలో ఆధునిక సాంకేతికతల ప్రాధాన్యాన్ని వివరించారు. అనంతరం నిర్వహించిన ప్రశ్నోత్తర కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని నిపుణుడిని పలు ప్రశ్నలు అడిగారు. భూ, పర్యావరణ శాస్త్రాల్లో జరుగుతున్న సమకాలీన పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధిపై అవగాహన పొందారు. కార్యక్రమం ముగింపులో వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శాస్త్రవేత్తలు, నిపుణులతో నేరుగా మమేకమయ్యే అవకాశాలు కల్పించడం ద్వారా అనుభవపూర్వక అభ్యసనాన్ని ప్రోత్సహిస్తున్నట్లు కళాశాల ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా. బి.ఆర్.సంజీవ రెడ్డితో పాటు అన్ని విభాగాల అధిపతులు, డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఇంజినీరింగ్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ బి.బాపి రాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు

## డ్రగ్స్, మత్తు పదార్థాల బారిన పడొద్దు

- విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి: ఎస్సై శశిధర్



**గోపాల్పేట్, ఆగస్టు22(జనంసాక్షి):** విద్యార్థులు ఇంటర్మీడియట్ దశ నుంచే జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎస్సై శశిధర్ సూచించారు. గోపాల్పేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డ్రగ్స్, మత్తు పదార్థాలు, బాల్యవివాహాలు, ర్యాగింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్సై శశిధర్ మాట్లాడుతూ చెడు వ్యసనాలు యువతను ఆకర్షించి భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదం ఉందన్నారు. తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశలను గుర్తించి, చదువుపై దృష్టి సారించాలని సూచించారు.

**మైనర్లు వాహనాలు నడపొద్దు:** 18 ఏళ్లు నిండని విద్యార్థులు ద్విచక్ర వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని ఎస్సై తెలిపారు. మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమైతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాల్యవివాహాలకు దూరంగా ఉండాలని సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత: సోషల్ మీడియా, ఇన్‌స్టాగ్రామ్ వినియోగంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. చిన్న తప్పిదాలకే పోలీస్ కేసులు నమోదైతే భవిష్యత్తులో విద్య, ఉద్యోగ అవకాశాలపై ప్రభావం పడే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుప్రజాత, సైబర్ క్రైమ్ ఎస్సై అంజాద్ ఖాన్, భరోసా సెంటర్ కన్వీనర్ మమత, షీ టీం సభ్యురాలు భవిత, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్మీట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని సందర్శించిన ఎమ్మెల్యేలు

- ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి

**నంగునూరు, ఆగస్టు22 (జనంసాక్షి):** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలోని ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీలో ఆయిల్‌పామ్ గెలల ప్రాసెసింగ్ జరుగుతున్న తీరును పరిశీలించిన ఎమ్మెల్యేలు, అక్కడి అధికారులు, సిబ్బందిని అడిగి ప్రాసెసింగ్ విధానం, రోజువారీగా జరుగుతున్న ప్రక్రియ, రైతుల నుంచి సేకరించిన ఆయిల్‌పామ్ గెలల నిర్వహణ తదితర అంశాలపై వివరాలు తెలుసు



కున్నారు. అనంతరం ఫ్యాక్టరీలోని వివిధ విభాగాలను పరిశీలించి, రైతులకు అందుతున్న సేవలు, ఆయిల్‌పామ్ సాగు ద్వారా రైతులకు కలుగుతున్న ప్రయోజనాలు, ఫ్యాక్టరీ పనితీరుపై అధికారులతో చర్చించారు. ఆయిల్‌పామ్ సాగును మరింత అభివృద్ధి చేసి రైతులకు మెరుగైన ప్రయోజనాలు



అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు ఫ్యాక్టరీ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా సరిపడా నిల్వలు.. యాప్ ద్వారా సులభంగా బుకింగ్

**మెదక్ టౌన్, ఆగస్టు 22 (జనంసాక్షి):** మెదక్ డివిజన్ పరిధిలోని మెదక్, పాపన్నపేట, హవేలీ ఘనపూర్, శంకరంపేట మండలాల్లో రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా ఎరువులు సరిపడా నిల్వ ఉన్నాయని మెదక్ డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు (ADA) అమీనాబి తెలిపారు.




ప్రస్తుతం పంటల సాగు దశలో యూరియా అవసరం పెరుగుతున్న నేపథ్యంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని ఆమె స్పష్టం చేశారు. ఆయా మండలాల్లో అవసరమైన మేరకు యూరియా అందుబాటులో ఉందన్నారు. ఎరువుల పంపిణీ ప్రక్రియను మరింత పారదర్శకంగా, సులభతరంగా నిర్వహించేందుకు "ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్" యాప్ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు అమీనా బి తెలిపారు. రైతులు యూరియా, ఇతర అవసరమైన ఎరువులను పొందేందుకు ఈ యాప్‌లో ముందుగానే బుకింగ్ చేసుకోవాలని సూచించారు. యాప్ ద్వారా బుకింగ్ చేసుకోవడం వల్ల ఎరువుల లభ్యతను తెలుసుకోవడంతో పాటు, తమకు అవసరమైన ఎరువులను ముందుగానే నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ విధానం ద్వారా పంపిణీలో పారదర్శకత పెరగడంతో పాటు, రైతులకు సమయానికి ఎరువులు అందించేలా చర్యలు తీసుకోవచ్చన్నారు.

రైతులు నేరుగా విక్రయ కేంద్రాలకు వచ్చి ఇబ్బందులు పడకుండా ముందుగానే యాప్‌లో బుకింగ్ చేసుకోవాలని సూచించారు. యాప్ వినియోగంలో సందేహాలు లేదా సాంకేతిక సమస్యలు ఎదురైతే మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు), సమీప వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించాలని కోరారు. యూరియా విషయంలో రైతులు అపోహలు, వదంతులను నమ్మకుండా వ్యవసాయ శాఖ అధికారిక సమాచారాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని అమీనాబి సూచించారు. రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువుల సరఫరాపై వ్యవసాయ శాఖ నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందని తెలిపారు.

## రామాయంపేటలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి : కౌన్సిలర్ శంకర్ గౌడ్

- డెంగ్యూ, మలేరియా వంటి విషజ్వరాల నుంచి ప్రజలను కాపాడాలి
- 8వ వార్డు కౌన్సిలర్ జంగంపల్లి శంకర్ గౌడ్ వినతి

**రామాయంపేట, ఆగస్టు 22 (జనంసాక్షి):** రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో దోమల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తక్షణమే చర్యలు చేపట్టాలని 8వ వార్డు కౌన్సిలర్ జంగంపల్లి శంకర్ గౌడ్ మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో నాణ్యమైన దోమల నివారణ మందులతో స్ప్రే చేయడంతో పాటు, విస్తృతంగా ఫాగింగ్ నిర్వహించాలని ఆయన కోరారు. ముఖ్యంగా కాలనీలు, మురుగు కాలువలు, నీరు నిలిచే ప్రదేశాలు, చెత్త పేరుకుపోయే ప్రాంతాల్లో పారిశుధ్య చర్యలను మరింత ముమ్మరం చేయాలని సూచించారు. దోమల వల్ల డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ తదితర జ్వరాలు వ్యాపించే అవకాశం ఉందని, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, పేద - మధ్యతరగతి కుటుంబాలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని శంకర్ గౌడ్ పేర్కొన్నారు. జ్వరాలు వచ్చినప్పుడు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి రావడంతో చికిత్స కోసం



వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని, దీంతో ఆయా కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందన్నారు. ప్రజల ఆరోగ్యం, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ అధికారులు ఆలస్యం చేయకుండా అన్ని వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కోరారు. దోమల నియంత్రణ కోసం క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహిస్తూ, మురుగు కాలువలను శుభ్రం చేయాలని, నిల్వ నీటి ప్రాంతాలను గుర్తించి తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడంతో పాటు, పారిశుధ్య పనులను వేగవంతం చేసి రామాయంపేటను దోమల రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ జంగంపల్లి శంకర్ గౌడ్ కోరారు.

## దళిత జర్నలిస్టుపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- దళిత జర్నలిస్టుల ఫోరం రాష్ట్రఉపాధ్యక్షురాలు కర్రోళ్ల అన్నమ్మ



**చేర్యాల, ఆగస్టు 22(జనంసాక్షి) :** దళిత జర్నలిస్టు పుల్లా రవీందర్‌పై దాడికి పాల్పడిన వ్యక్తులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దళిత జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కర్రోళ్ల అన్నమ్మ డిమాండ్ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలానికి చెందిన రవీందర్ ప్రముఖ ఆర్.బి. న్యూస్ సంస్థలో జర్నలిస్టుగా పనిచేస్తున్నారని తెలిపారు. స్థానికంగా జరుగుతున్న అక్రమాలపై వార్త ప్రచురించిన నేపథ్యంలో కొందరు వ్యక్తులు అర్ధరాత్రి ఆయన నివాసానికి వెళ్లి దాడి చేశారని ఆరోపించారు. ఈ ఘటనలో రవీందర్‌తో పాటు ఆయన భార్యపై కూడా దాడి చేసి కులం పేరుతో దూషించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కర్రోళ్ల అన్నమ్మ డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

## పోతిరెడ్డిపల్లిలో ఘనంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**చేర్యాల, ఆగస్టు 22(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు ప్రజల దరి చేరుతున్నాయి. ఇందులో భాగంగా సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం శనివారం



అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ మెడబోయిన కుమార్, ఉపసర్పంచ్ పోలోజు రాజబాబు, గ్రేడ్-1 పంచాయతీ అధికారి (జిపిఓ) రాంబాబు, గ్రామ పంచాయతీ కార్యదర్శి శోభా రాణి హాజరై లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా 10వార్డు సభ్యులు లింగంపల్లి సురేష్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా ప్రభుత్వ ఫలాలు అందుతున్నాయని తెలిపారు. నూతన స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ సరుకులు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు మరింత సులభంగా చేరువవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, పంచాయతీ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు,లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఎరువులు ఎమ్మార్పీ రేట్లకి అమ్మాలి

**మల్దకల్, ఆగస్టు 22 (జనంసాక్షి):** మండలంలోని ఎరువుల దుకాణాలను శనివారం జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ నాయక్, మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి రైతులతో మాట్లా



డుతూ ప్రతి ఒక్క రైతు ఫర్టిలైజర్ యాప్ ద్వారా యూరియాతో పాటు ఇతర కాంప్లెక్స్ ఎరువులను కూడాబుక్ చేసుకోవాలని రైతులకు సూచించారు. అదేవిధంగా దుకాణదారుడు బుక్కు చేసుకోవడం తెలియని రైతులకు బుక్కు చేయించి ఎరువులు అందజేయాలని డీలర్లకు చెప్పడం జరిగింది. ఎరువులడీలర్లు అందరూ ఎంఆర్పి రేట్లకే ఎరువులు అమ్మాలని,అధిక ధరలకు అమ్మితేకఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# దివ్యాంగుల యూడీఐడీ శిబిరం తేదీలో మార్పు

- ఆగస్టు 25న మెదక్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ప్రత్యేక శిబిరం



**మెదక్ బ్యూరో, ఆగస్టు 22 (జనంసాక్షి):** దివ్యాంగుల కోసం నిర్వహించనున్న యూడీఐడీ శిబిరం తేదీలో మార్పు చేసినట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు తెలిపారు. తొలుత ఆగస్టు 26న శిబిరం నిర్వహించనున్నట్లు ప్రకటించినప్పటికీ, ఆ రోజు మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు ఉన్నందున శిబిరాన్ని ఆగస్టు 25న నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మెదక్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఆగస్టు 25న దివ్యాంగుల యూడీఐడీ ధ్రువీకరణ కోసం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నూతన చేయూత పింఛన్ల దరఖాస్తుల గడువు ఆగస్టు 31తో ముగియనున్న నేపథ్యంలో, ఇప్పటివరకు యూడీఐడీ ధ్రువీకరణ పత్రం పొందని దివ్యాంగులు ఈ నెల 25వ తేదీ సాయంత్రం వరకు మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మీ సేవలో దరఖాస్తు చేసుకున్న వారికి సోమవారం స్లాట్ కేటాయింపు జరుగుతుందని, అనంతరం ఆగస్టు 25న మెదక్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో జరిగే శిబిరానికి హాజరై యూడీఐడీ ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని శ్రీనివాసరావు తెలిపారు. యూడీఐడీ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి శిబిరం నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యాలయం, మండల సహాయక ప్రాజెక్టు మేనేజర్ల ద్వారా తెలియజేస్తామని ఆయన పేర్కొన్నారు.

## కోటకొండలో

# రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ అడ్డుకున్న బీజేపీ నాయకులు

- ప్రధాని ఫోటో పెట్టాలని డిమాండ్



**నారాయణపేట, ఆగస్టు 22(జనంసాక్షి):** స్మార్ట్ రేషన్ కార్డుపై ప్రధాని నరేంద్ర మోదీ ఫోటో పెట్టకపోవడాన్ని నిరసిస్తూ వెంటనే ప్రధాని ఫోటో పెట్టి రేషన్ కార్డులు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం నారాయణపేట జిల్లా ,మండలంలోని కోట కొండ గ్రామంలో బిజెపి నాయకులు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ నీ అడ్డుకున్నారు.రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీలో ఒక్కొక్కరికి ఐదు కిలోల చొప్పున కేంద్ర ప్రభుత్వం బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందనీ తెలిపారు.ఇలా ఉచితంగా పంపిణీ చేస్తున్న మన ప్రధా ని నరేంద్ర మోడీ ఫోటోను స్మార్ట్ కార్డులపై ఉంచక పోవడంతో కేవలం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఫోటో, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఫోటో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫోటో లు మాత్రమే పెట్టి పంపిణీ చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నిం చారు. కార్డులపై నరేంద్ర మోడీ ఫోటోను కూడా పెట్టి స్మార్ట్ రేషన్ కార్డు పంపిణీని చేయాలని డిమాండ్ చేశా రు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు కెంచే శ్రీనివాసులు,జిల్లా నాయ కులు చెన్నప్పయాదవ్ ,నాయకులు భగవాన్ శంక ర్ ,చర్లపల్లి ఆంజనేయు లు,వేపుర్ రవికుమార్, ఈగలి వెంకటేష్, సూర్తి సాయికిరణ్ ,నగేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

- పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన న్యాయమూర్తి ఎం. హేమలత




**నర్సాపూర్, ఆగస్టు 22 (జనంసాక్షి):** జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ, మెదక్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థల ఆదేశాల మేరకు నర్సాపూర్ మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడానికి పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి, మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ న్యాయమూర్తి ఎం. హేమలత మాట్లాడుతూ.. రాజీ చేయదగిన కేసుల్లో కక్షిదారులు రాజీ కుదుర్చుకుని సత్వర పరిష్కారం పొందేందుకు సెప్టెంబర్ 12న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నర్సాపూర్ కోర్టు పరిధిలోని పోలీస్ అధికారులు కక్షిదారులకు పూర్తి సహకారం అందించి, రాజీ చేయదగిన కేసులను జాతీయ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునేలా ప్రోత్సహించాలని ఆమె కోరారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు త్వరితగతిన పరిష్కారం కావడంతో సమయం, ఖర్చు ఆదా అవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో నర్సాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రంగా కృష్ణ, నర్సాపూర్ సబ్‌ఇన్‌స్పెక్టర్ రంజిత్ రెడ్డి, చిలప్‌చెడ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ నర్సింలు, నర్సాపూర్ ఎక్సైజ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ రావు, కౌడిపల్లి డబ్ల్యూఏఎస్ఐ అండాలు, పోలీస్ కోర్టు కానిస్టేబుళ్లు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉచిత కంటి శిబిరానికి విశేష స్పందన



**నర్సాపూర్, ఆగస్టు 22 (జనంసాక్షి):** నర్సాపూర్ పట్టణంలోని శ్రీ సాయి కృష్ణ గార్డెన్స్‌లో రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పుష్పగిరి రెటినా ఇన్‌స్టిట్యూట్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరానికి పట్టణం నుంచి సుమారు 600 మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి పరీక్షల అనంతరం ఆపరేషన్ అవసరమైన వారికి 4-5 రోజుల్లో ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే కళ్లద్దాలు అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేస్తామని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ఈ

కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీరాజు యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రీధర్ గుప్తా, కార్యకర్తలు, రాజన్న ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలి



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 22 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లాలో జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల జారీలో జరుగుతున్న జాప్యాన్ని వెంటనే నివారించి, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు సకాలంలో కార్డులు అందించాలని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. వెంకటస్వామి కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అక్రిడిటేషన్ ప్రక్రియ పూర్తయి జర్నలిస్టులకు కార్డులు అందుతున్నప్పటికీ, నాగర్‌కర్నూల్ జిల్లాలో మాత్రం ప్రక్రియలో జాప్యం కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటికే రెండోసారి అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జరిగినప్పటికీ కొంతమంది జర్నలిస్టులకు మాత్రమే కార్డులు అందాయని, ఇంకా అనేక మంది అర్హులైన జర్నలిస్టులు కార్డుల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు.

నెలల తరబడి అక్రిడిటేషన్ కార్డుల కోసం నిరీక్షించాల్సి రావడంతో జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం, ప్రజలకు జర్నలిస్టులు వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్నారని, అలాంటి జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో జాప్యం, నిర్లక్ష్యం తగదన్నారు. పెండింగ్‌లో ఉన్న అక్రిడిటేషన్ ప్రక్రియను తక్షణమే వేగవంతం చేసి, అర్హత కలిగిన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.అదేవిధంగా అక్రిడిటేషన్ కలిగిన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టుల పిల్లలకు కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య అందేలా ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో జర్నలిస్టులకు మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక ఆరోగ్య సదుపాయాలు కల్పించాలని కోరారు.

జర్నలిస్టుల సమస్యలపై స్పందించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారిని (డీపీఆర్ఓ) ఆదేశించినట్లు పి. వెంకటస్వామి తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

# రైతులకు సరిపడని యూరియా...

- ఆన్లైన్ వచ్చినప్పటి నుండి కంటికి కనపడకుండా ఖాళీ అవుతున్న గోదాములు




**నర్వ, ఆగస్టు 22 (జనంసాక్షి):** నర్వ మండలంలో రైతులను చాలా రోజులనుండి యూరియా సమస్య వెంటాడుతూ ఉంది,ఒకవైపు వానలు లేక పంటలు ఎండుబారుతుంటే అరకొర నీరు ఉన్న రైతులు పంటలకు యూరియా లేక ఇబ్బందులకు గురవుతున్నారు.ఈమధ్య కాలంలో మండలంలో చెరుకు సాగు పెరగడంతో రైతులకు చెరుకు పంట పెరుగుటకు యూరియా చాలా అవసరం,ఎకరాకు సంవత్సరానికి 4నుండి 7 బస్తాల యూరియా అవసరం,నర్వ మండలానికి తక్కువ యూరియా రావడం వల్ల రైతులకు సరిపడా ఇవ్వాలెమని ఫర్టిలైజర్ దుకాణం దారులు తేల్చి చెప్తున్నారు.దానికి తోడు ఆన్లైన్ యాప్ ద్వారా రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.మండలంలో బూతుపూర్ రిజర్వయర్ నుండి పలు గ్రామాలకు నీటి సరఫరా ఉంది ఆయా గ్రామాలలో వరి,చెరుకు పంటలు అధిక సాగులో ఉన్నందువల్ల రైతులకు యూరియా కొరత చాలా ఉంది,ఈవిషయం అధికారులు గుర్తించి రైతులకు సరిపడా యూరియా పంపిణి చేయాలనీ రైతులు కోరుతున్నారు.

# కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ పనులను తక్షణమే ప్రారంభించి సాగు నీటిని వదలలి

- మాజీ ఎంపీపీ కృష్ణనాయక్



**ఖిల్లా ఘనపురం, ఆగస్టు 22 (జనంసాక్షి):** ఖిల్లా ఘనపురం మండల కేంద్రం పాత్రికేయుల భవనంలో బిఆర్ఎస్ పార్టీ మండల నాయకుల ఆధ్వర్యంలో కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్‌పై ఏర్పాటుచేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఏం.పి.పి కృష్ణ నాయక్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గుట్టపై ఉన్న ఎత్తైన తండాల రైతులకు సాగు నీరు అందించాలనే అభ్యర్థనను అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు కృష్ణనాయక్ తెలిపారు.

రైతుల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం, కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ ఎత్తిపోతల పనులకు సంబంధించి రూ. 76.19 లక్షలు మంజూరు చేస్తూ జీవో జారీ చేసిందని గుర్తుచేశారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా పనులను త్వరగతిన ప్రారంభించి కేవలం 8 నెలల్లో 85 శాతం పనులను పూర్తయ్యాయనీ, విద్యుత్ అవసరాల నిమిత్తం సబ్ స్టేషన్ పనులు పెండింగ్‌లో ఉన్న సమయంలో ఎన్నికలు రావడంతో పనులకు బ్రేక్ పడిందని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి సమయం గడుస్తున్నా కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభానికి నోచుకోలేదని, స్థానిక ఎమ్మెల్యే కేవలం రిబ్బన్ కటింగులకే పరిమితమయ్యారని విమర్శించారు.

సోమవారం కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ ఎత్తిపోతల కాలువ పనులు ప్రారంభించి రైతులకు సాగు నీళ్లు అందించాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రాళ్ళ కృష్ణయ్య, శ్రీనివాస్ నాయక్, మాన్య నాయక్, చిన్న ఆంజనేయులు గౌడ్, బెస్త గోపాల్, గొడుగు సత్యం, షాపూర్ మన్యం గౌడ్, మున్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నమారూర్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు రైతు కమిటీలు

• **రైతుల భాగస్వామ్యంతో పథకం నిర్వహణకు మంత్రి జూపల్లి పిలుపు**

**చిన్నంబావి, ఆగస్టు 22 (జనంసాక్షి):** చిన్నంబావి మండలంలోని చిన్నమారూర్ మినీ ఎత్తిపోతల పథకం నిర్వహణతో పాటు రైతుల సమస్యల పరిష్కారానికి ఆయకట్టు రైతులతో రైతు కమిటీలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. శనివారం చిన్నమారూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పంప్‌హౌస్ వద్ద నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మంత్రి పాల్గొని పథకం పనితీరును పరిశీలించారు. ఇటీవల లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైర్ చోరీ కావడంతో సాంకేతిక సమస్య ఏర్పడింది. అధికారులు సమస్యను పరిష్కరించి నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం భారీ మోటార్లను మంత్రి జూపల్లి కృష్ణారావు స్విచ్ ఆన్ చేసి సుమారు 6 వేల ఎకరాలకు సాగునీటిని విడుదల చేశారు.

**రైతులే రక్షణ బాధ్యత తీసుకోవాలి...**

**ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..** లిఫ్ట్ ఇరిగేషన్ పథకంలో భవిష్యత్‌లో చోరీలు, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా రైతులు ఐక్యంగా కమిటీలు ఏర్పాటు చేసుకుని పథకాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. రైతులు, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పనిచేస్తే పథకం నిరంతరాయంగా సాగునీటిని అందించేలా చూడవచ్చన్నారు. ఆయకట్టు రైతులు ఎకరాకు రూ.500 చొప్పున జమ చేసుకుని, సాంకేతిక లోపాలు తలెత్తినప్పుడు కమిటీ ద్వారా అధికారుల సహకారంతో వెంటనే మరమ్మతులు చేయించుకునే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. చిన్నమారూర్ ఎత్తిపోతల పథకాన్ని తీసుకు రావడంలో అప్పటి శాసనసభ్యుడు వెంకటేశ్వరరావు కీలక పాత్ర పోషించారని మంత్రి గుర్తుచేశారు. 1980 ప్రాంతంలో నెదర్లాండ్స్ విదేశీ పథకం ద్వారా వచ్చిన నిధులను సాగునీటి అవసరాలకు వినియోగించేలా ఆయన కృషి చేశారని తెలిపారు. కొల్లాపూర్ ప్రాంతంలో కృష్ణానది, నల్లమల అడవుల మధ్య ఉన్న రైతుల సాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.



**రూ.79 కోట్లతో రెండు రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు...**

ఈ నెల 24న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చిన్నంబావి మండలానికి రానున్నారని జూపల్లి తెలిపారు. చిన్నంబావి నుంచి గూడెం, బెక్కం, మియాపూర్, వెలగొండ గ్రామపంచాయతీ వరకు డబుల్ బీటీ రహదారి నిర్మాణానికి సుమారు రూ.40 కోట్లు, చిన్నంబావి నుంచి చెల్లెపాడు వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.39 కోట్లు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. రహదారుల నిర్మాణంతో మండలంలోని గ్రామాలకు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని చెప్పారు. అలాగే చిన్నంబావి మండలంలో సాంస్కృతిక కార్యక్రమాలు, సమావేశాల నిర్వహణకు వీలుగా సుమారు రూ.2 కోట్లతో సమావేశ మందిరం నిర్మాణానికి నిధులు మంజూరు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ చంద్రశేఖర్, ఇరిగేషన్ డీఈ కవిత, ఏఈ జాషువా, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ఆదర్శ్‌గౌడ్, మాజీ సింగిల్‌విండో చైర్మన్ బంగారి నరసింహారెడ్డి, వైస్ చైర్మన్ బిళ్లగంటి సాగర్‌రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రారెడ్డి, సర్పంచులు వడ్డేమాన్ బిచ్చన్న, కే.లక్ష్మయ్య, మాజీ ఎంపీటీసీ కే.చంద్రయ్య, భాస్కర్, శంకర్, మాజీ జెడ్పీటీసీ కృష్ణప్రసాద్, చంద్రశేఖర్ యాదవ్, బీచుపల్లి యాదవ్, మాజీ సర్పంచ్ కల్వకోల్ ఉషనయ్య, హనుమంతరావు, సుధాకర్ నాయుడు, తేజారెడ్డి, వెంకటస్వామి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.



# పెద్ద శంకరంపేట ఉపసర్పంచ్ పై పోలీస్ స్టేషన్లో సర్పంచ్

• **జంగం రేణుక ఫిర్యాదు...**
• **గ్రామ సభలో సర్పంచ్‌పై చేయి**
• **సర్పంచ్ భర్తపై ఉపసర్పంచ్ దాడి ఘటనపై ఫిర్యాదు**

**పెద్ద శంకరంపేట్, ఆగస్టు 22 (జనంసాక్షి):** మండల కేంద్రమైన పెద్ద శంకరంపేటలో పాత గ్రామపంచాయతీ వద్ద నిర్వహించిన గ్రామసభలో గ్రామ సర్పంచ్ జంగం రేణుక చేయి పై.. సర్పంచ్ భర్త మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్ పై గుంజుకుంటూ వెళ్లి ఉపసర్పంచ్ రాజు గౌడ్ దాడి చేసినట్లు శనివారం పెద్ద శంకరంపేట పోలీస్ స్టేషన్ లో సర్పంచ్ జంగం రేణుక శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. పెద్ద శంకరంపేటలోని పాత గ్రామ పంచాయతీ (చావిడి) వద్ద మధ్యాహ్నం గ్రామ సభ నిర్వహిస్తున్న సమయం లో ఉప సర్పంచ్ రాజు గౌడ్ సర్పంచ్ అయిన జంగం రేణుక చేతిపై.. గతంలో సైతం సర్పంచ్ స్థానంలో తాను మాట్లాడుతుండగా ఉపసర్పంచ్ రాజు గౌడ్ దురుసుగా ప్రవర్తించి గట్టిగా అరుస్తూ నన్న భయభ్రాంతులకు గురి చేశారని ఆమె పేర్కొన్నారు. పేట పంచాయతీ కార్యదర్శి విధులకు విరుద్ధంగా వెళ్తున్నందుకు గ్రామ సభలో తన భర్త జంగం శ్రీనివాస్ అడిగినందుకు ఉప సర్పంచ్ రాజు గౌడ్ తనపై తన భర్త పై దాడి చేశారని ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఉప సర్పంచ్ రాజు గౌడ్ పై అధికారులు పోలీసులు తగల చర్యలు తీసుకోవాలని ఆమె కోరుతున్నారు.

# ధరూర్‌లో మెడ్ ప్లస్ మెడికల్ షాప్ ప్రారంభం



**ధరూర్, ఆగస్టు22 (జనంసాక్షి):** గద్వాల నియోజకవర్గంలోని ధరూర్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మెడ్ ప్లస్ మెడికల్ షాప్‌ను స్థానిక ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి శుక్రవారం రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా షాప్ యజమాని ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మెడికల్ షాప్‌లో తొలి కొనుగోలు చేసి శుభారంభం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు రమేష్ నాయుడు, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు రాజశేఖర్, మాజీ వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ శ్రీధర్ గౌడ్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, డి.వై. రామన్న, హనుమంత్ రెడ్డి, నాగన్న, అంజి సాగర్, జానీ, రాజేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గిరిజన తండా విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ..

• **విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తే లక్ష్యం: సర్పంచ్ అనూష సతీష్‌రెడ్డి**



**మహమ్మదాబాద్, ఆగస్టు22 (జనంసాక్షి):** విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికా హారం, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా చౌదర్పల్లి గ్రామ సర్పంచ్ సుక్కిరెడ్డి అనూష సతీష్‌రెడ్డి,అన్నారు.మండల పరిధిలోని,శనివారం చౌదర్పల్లి పెద్దతండాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు భోజనం చేసేందుకు ప్లేట్లు,నీళ్లు తాగేందుకు గ్లాసులను,చౌదర్పల్లి గ్రామ సర్పంచ్ అనూష సతీష్ రెడ్డి,పంపిణీ చేశారు.ఈసందర్భంగా వారు,మాట్లాడుతూ..విద్యార్థులు పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం చేయాలనే ఉద్దేశంతో ప్లేట్లు,గ్లాసులు అందించినట్లు సర్పంచ్ అనూష సతీష్‌రెడ్డి,తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానన్నారు.

అనంతరం విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకుని తల్లిదండ్రులకు,గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.సొంత గ్రామ విద్యార్థులకే కాకుండా,పక్కనే ఉన్న పెద్ద తండా గ్రామ పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు,గ్లాసులు,పంపిణీ చేయడం చాలా సంతోషకరమని,పెద్దతండా గ్రామ సర్పంచ్ రాకేష్ పేర్కొన్నారు.అనూష సతీష్‌రెడ్డి, దంపతులకు చౌదర్పల్లి పెద్దతండా గ్రామ సర్పంచ్ రాకేష్, పాఠశాల, ఉపాధ్యాయులు, విద్యార్థులు,గ్రామస్థులు ప్రతేక అభివందనాలు తెలిపారు.

# ఎరువుల కొరతపై రైతులు ఆందోళన చెందొద్దు

• **జిల్లాలో 3,340 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి**
• **అవసరానికి మించి బుకింగ్ చేయడం వల్లే యాప్‌లో సాంకేతిక సమస్యలు**
• **రైతులు అవసరమైన మేరకే ఎరువులు కొనుగోలు చేయాలి: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్ బ్యూరో, ఆగస్టు 22 (జనంసాక్షి):** జిల్లాలో ఎరువుల కొరత లేదని, ప్రస్తుతం 3,340 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ఎరువుల కోసం రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె స్పష్టం చేశారు. రైతులు తమ అవసరాలకు అనుగుణంగా మాత్రమే ఎరువులను బుక్ చేసుకుని కొనుగోలు చేయాలని శనివారం విడుదల చేసిన ప్రకటనలో సూచించారు.ఖరీఫ్-2025లో ఆగస్టు వరకు జిల్లాలో 20,758 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఖరీఫ్-2026లో ఆగస్టు వరకు ఇప్పటివరకు 19,045 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేసినట్లు వివరించారు. ప్రతిరోజూ మండలాల్లో సుమారు 1,000 నుంచి 1,500 బ్యాగుల వరకు ఎరువులు అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు.యాప్‌లో సాంకేతిక సమస్యల పరిష్కారానికి చర్యలు ఎరువుల విక్రయాలను పారదర్శకంగా నిర్వహించేందుకు ఆగస్టు 7, 2026 నుంచి ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా ఎరువుల విక్రయాలు ప్రారంభించినట్లు కలెక్టర్ తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని గత రెండు రోజులుగా డివిజన్ వారీగా ఎరువుల సరఫరా జరిగేలా యాప్‌ను అనుగుణంగా తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు.

**అవసరానికి మించి బుకింగ్ చేయొద్దు...**

అందుబాటులో ఉన్న ఎరువుల కంటే ఎక్కువగా రైతులు బుకింగ్ చేయడం వల్ల యాప్‌లో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమస్యలపై కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్‌కు నివేదిక పంపినట్లు, సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. రైతులు అవసరానికి మించి ఎరువులను కొనుగోలు చేయడం వల్ల నిజంగా అవసరమైన రైతులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ సూచనలు, సలహాలను పాటిస్తూ అవసరమైన మేరకు మాత్రమే యాప్ ద్వారా ఎరువులను బుక్ చేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.అందుబాటులో ఉన్న ఎరువులను రైతులందరికీ సమానంగా అందేలా సహకరించాలని, సమన్వయం పాటించి ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ కోరారు.

# అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు చేరాలి.సర్పంచ్ జ్యోతి వరదరాజు

**గద్వాల ఆగస్టు22 (జనంసాక్షి):** కొంకల గ్రామంలో డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.గ్రామ సర్పంచ్ జ్యోతి వరదరాజు లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా గ్రామ పంచాయతీ తరపున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.కార్డుల ద్వారా ప్రజలకు రేషన్ సరుకులు పొందడంలో మరింత సౌకర్యం కలగడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పారదర్శకంగా అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.అర్హత కలిగిన ప్రతి కుటుంబం రేషన్ కార్డు వివరాలను సరిచూసుకుని అవసరమైన సేవలను వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వడ్డే సంజీవ,పంచాయతీ సెక్రెటరీ జ్ఞానేశ్వరి,జిపిఓ మమత,గ్రామ పెద్దలు,పంచాయతీ సిబ్బంది,లబ్ధిదారులు పాల్గొన్నారు.



## పెన్షన్ దరఖాస్తులను వెంటనే అప్‌లోడ్ చేయాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ స్వేత సత్య యాదవ్



**నారాయణపేట, ఆగస్టు 22(జనంసాక్షి):** కొత్త పింఛన్ దరఖాస్తులను వెంటనే అప్‌లోడ్ చేయాలని నారాయణపేట మున్సిపల్ చైర్‌పర్సన్ కొండా శ్వేత సత్యయాదవ్ అధికారులను ఆదేశించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఆమె పెన్షన్ దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు 588 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినట్లు, మరో 126 దరఖాస్తులను అప్‌లోడ్ చేయాల్సి ఉన్నట్లు తెలిపారు. పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తులను స్వయంగా పరిశీలించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెన్షన్ దరఖాస్తులకు ఆగస్టు 31 చివరి తేదీ కావున పట్టణంలోని అర్హులైన పౌరులందరూ గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థి కుటుంబానికి రెడ్‌క్రాస్ సొసైటీ లక్ష ఆర్థిక సహాయం



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 22(జనంసాక్షి):** నారాయణపేట మండలం ఎక్లాస్‌పూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదు వుతున్న విద్యార్థి పాముకాటుకు గురై మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నిరుపేద కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్య క్షురాలు సి.హెచ్. ప్రియాంక, ఆదేశాల మేరకు శనివారం జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వ ర్యంలో బాధిత కుటుంబాని కి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. విద్యార్థి కుటుంబంలోని జీవించి ఉన్న ఇద్దరు సోద రులైన 5వ తరగతి, 2వ తరగతి చదువుతున్న చిన్నారుల పేరిట ఎస్‌బీ ఐలో ఒక్కొక్కరికి .50 వేల చొప్పున రెండు ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లను ఏర్పా టు చేశారు. ఈ బాండ్లను విద్యార్థుల తల్లిదండ్రులు పిచ్చిగుంట్ల గురునాథ్ దంపతులకు జిల్లా కలెక్టరేట్ లో కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక మాట్లాడుతూ, బాధిత కుటుంబానికి అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించిన జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులను అభి నందించారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు మాన వతా దృక్పథంతో సహాయ సహకారాలు అందించ డంలో రెడ్‌క్రాస్ సొసైటీ ముందుండాలని సూచించారు. అనంతరం జిల్లా రెడ్‌క్రా స్ సొసైటీ సభ్యత్వ నమోదు, జిల్లా బాడీ ఎన్నికల నిర్వహణ తదితర అంశా లపై సమావేశంలో సమీక్షిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మ న్ కొట్టం సుదర్శన్ రెడ్డి, వైస్ చైర్మన్ సరఫ్ నాగరా జ్, కోశాధికారి డాక్టర్ మదన్‌మోహన్ రెడ్డి, స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యులు ఆత్మారం ఎడ్కే, ప్యాట్రన్ శ్రీ హరినారాయణ భట్టాడ్, వై ఆర్ సి,జే ఆర్ సి కోఆర్డినేటర్లు జొన్నల సుభాష్, నందుపాటిల్, సభ్యులు శ్రీనివాస్ లాహోటి, యూసు ఫ్ తాజ్ తదితరులు పాల్గొన్నారు.

## బాలానగర్‌లో ఘనంగా హైదరాబాద్ కోత్వాల్ రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి 157వ జయంతి!



**బాలానగర్, ఆగస్టు 22(జనంసాక్షి):** మహబూబ్ నగర్ జిల్లా, బాలానగర్ మండల కేంద్రంలో హైదరాబాద్ కోత్వాల్ రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి 157వ జయంతి వేడుకలను బాలానగర్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. 44వ జాతీయ రహదారిపై ఉన్న ఫ్లైఓవర్ వద్ద రెడ్డి సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

అనంతరం రెడ్డి సంఘం నాయకులు మాట్లాడుతూ.. రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి హైదరాబాద్ కోత్వాల్‌గా ప్రజా సేవకే అంకితమై, సమాజ అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ పేద విద్యార్థులకు అండగా నిలిచిన మహనీయుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ రెడ్డి సంఘం అధ్యక్షులు వెంకటరెడ్డి, స్థానిక సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి, పార్వతి రెడ్డి,అనంత్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి,సికిందర్ రెడ్డి, జగన్, రెడ్డి సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 27న ఉద్యోగ, ఉపాధ్యాయుల మహాధర్నా

- పెండింగ్ డీఏలతో పాటు పీఆర్సీని వెంటనే ప్రకటించాలి
- సీపీఎస్ రద్దు చేసి, ఓపీఎస్ పునరుద్ధరించాలి: టీజీ ఈజేఏసీ



**మక్తల్, ఆగస్టు 22 (జనంసాక్షి):** ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 27వ తేదీన నారాయణపేట జిల్లా కేంద్రంలోని వివేకానంద పార్కు (మున్సిపల్ పార్క్) వద్ద నిర్వహించ తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని టీజీ ఈజేఏసీ పిలుపునిచ్చింది. మక్తల్ పట్టణంలోని ఇన్స్పెక్షన్ బంగ్లా (IB)లో టీజీ ఈజేఏసీ భాగస్వామ్య సంఘాల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా టీఎన్ జీఓ మక్తల్ నియోజకవర్గ అధ్యక్షులు మున్వార్ అలీ, జిల్లా ఈజేఏసీ అడిషనల్ సెక్రటరీ జనరల్ వై. జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జేఏసీకి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తాత్సారం చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర, జిల్లా శాఖల పిలుపు మేరకు 27వ తేదీ న భారీ ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. పెండింగ్ డీఏలను వెంటనే మంజూరు చేసి, నూతన పీఆర్సీని ప్రకటించాలి. ఎన్నికల హామీ మేరకు సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి. నెలలు గడుస్తున్నా అమలుకు నోచుకోని నగదు రహిత ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని వెంటనే పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలి. జీవో 317 బాధితుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి. జీవో 25ను సవరించి ప్రాథమిక పాఠశాలల్లో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలి. 2004 సెప్టెంబర్ 1 కంటే ముందు నోటిఫికేషన్ విడుదలైన ఉద్యోగులకు పాత పెన్షన్ వర్తింపజేయాలి.

ప్రభుత్వ అలసత్వం కారణంగా ప్రతి ఉద్యోగి నెలకు 10,000 నుండి 25,000 వరకు నష్టపోతున్నారని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సహనాన్ని పరీక్షించకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజీ ఈజేఏసీ కో-చైర్మన్లు వెంకటస్వామి, సూర్య చంద్ర, రాంగోపాల్, శ్రీనివాస్, దామోదర్, హైమావతి, మునెప్ప, జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్ ఫ్రీ జిల్లాగా వనపర్తిని తీర్చిదిద్దాలి



చిన్నారులకు కల్లు విక్రయించకుండా ఎక్సైజ్ అధికారులు కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**ప్రమాదకర మందుల విక్రయంపై నిఘా...**

వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా ఆల్ప్రాజోలం, ట్రామడాల్ వంటి ప్రమాదకర మందులను విక్రయించే మెడికల్ షాపులపై ప్రత్యేక తనిఖీలు, దాడులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా మందులు విక్రయించే దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 52 మెడికల్ షాపులపై దాడులు నిర్వహించగా, 12 షాపుల్లో నిబంధనల ఉల్లంఘనలు గుర్తించామని, వాటిలో 10 షాపుల లైసెన్సులు రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

**యాంటీ డ్రగ్ కమిటీలను క్రియాశీలం చేయాలి...**

అన్ని విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్ కమిటీలను పూర్తిస్థాయిలో క్రియాశీలం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి నెలా కమిటీ సమావేశాలు నిర్వహించి విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించినప్పుడు అధికారులకు సమాచారం అందించేలా విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాలన్నారు.

**రోడ్డు భద్రతకు ప్రాధాన్యం...**

జాతీయ రహదారులపై ఆక్రమణలు, అనధికార పార్కింగ్‌ను అరికట్టాలని కలెక్టర్ ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే వారికి చలాన్లు, జరిమానాలు విధించడంతో పాటు పదేపదే నిబంధనలు ఉల్లంఘిస్తే ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయాలని సూచించారు. కొత్తకోట ప్రాంతంలో ప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లారీలు, ఇతర ట్రాన్స్‌పోర్టర్ల నిర్దేశిత పార్కింగ్ సదుపాయాలను వినియోగించేలా ఫుడ్ పిరమిడ్ పార్కింగ్ స్థలం వద్ద స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను తప్పనిసరిగా అమలు చేస్తూ జాతీయ రహదారులతో పాటు అంతర్గత రహదారులను కూడా సురక్షితంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**సీసీటీవీ నిఘా బలోపేతం...**

జిల్లా ఎస్పీ డి.సునీతారెడ్డి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రతిరోజూ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ నెల నుంచి విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలను పూర్తిస్థాయిలో క్రియాశీలం చేసి విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పిస్తామన్నారు. కమాండ్ కంట్రోల్ వ్యవస్థ ద్వారా జిల్లాలో సీసీటీవీ నిఘాను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై నిఘా పెంచి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఎస్పీ బాలాజీ నాయక్, డీటీఓ సురేష్, ఆర్‌అండ్‌బీ ఈఈ, డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్, జాతీయ రహదారుల అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరంగాపురంలో మండలస్థాయి ఎస్‌జిఎఫ్ క్రీడా పోటీలు

- జిల్లాస్థాయి పోటీలకు అర్హుల ఎంపిక ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, పిడి మద్దమ్మ



**శ్రీరంగాపూర్, ఆగస్టు 22 (జనంసాక్షి):** శ్రీరంగాపురం మండల కేంద్రంలో ఈరోజు శుక్రవారం మండలస్థాయి (SGF) (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించారు. క్రీడా పోటీలను ప్రారంభించి వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. అందులో ప్రతిభ కనబర్చిన ఉత్తమ క్రీడాకారులను ఎంపిక చేసి జిల్లా స్థాయి (SGF) ఎస్ జి ఎఫ్ క్రీడలకు పంపించడం జరిగిందని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) శ్రీరంగాపురం ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి మరియు పాఠశాల పీడీ. మద్దమ్మ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు:జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, కేజీబీవీ శ్రీరంగాపూర్ పీడీ గారు తదితరులు పాల్గొన్నారు.

# చెట్ల నీడన పాఠాలు.. 51 మంది విద్యార్థులకు ఒక్కరే ఉపాధ్యాయుడు

- **ఐదు తరగతులకు ఒకే గది.. వరండాలోనే బోధన**
- **అసంపూర్తి భవనం.. పాములు, తేళ్ల భయంతో విద్యార్థులు**
- **వెంటనే స్పందించాలని తల్లిదండ్రులు, గ్రామస్తుల విజ్ఞప్తి**

**చిన్నంబావి, ఆగస్టు 22 (జనంసాక్షి):** "పసి పిల్లలం సారూ.. జర చూడండి" అంటూ బెక్కెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు తమ సమస్యలను పరిష్కరించాలని వేడుకుంటున్నారు. పాఠశాలలో మొత్తం 51 మంది విద్యార్థులు ఉండగా ఒక్కరే రెగ్యులర్ ఉపాధ్యాయుడు విధులు నిర్వహిస్తున్నారు. మరో ఉపాధ్యాయుడు డిప్యూటేషన్‌పై రావడంతో పాఠశాలలో బోధన కొనసాగుతున్న పరిస్థితి నెలకొంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు, తరగతి గదులు లేకపోవడంతో చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**చెట్ల కింద.. వరండాలో తరగతులు...**

పాఠశాలలో ఐదు తరగతులకు సరిపడా గదులు లేకపోవడంతో విద్యార్థులకు సరైన వసతులు అందడం లేదు. దీంతో ఉపాధ్యాయుడు చెట్ల కింద, పాఠశాల వరండాలో విద్యార్థులకు పాఠాలు బోధించాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండ, వర్షం వంటి వాతావరణ పరిస్థితుల్లో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకే గదిలో ఎక్కువ మంది విద్యార్థులు ఉండటంతో బోధనకు కూడా ఆటంకం కలుగుతోందని చెబుతున్నారు.

**అసంపూర్తి భవనం.. పిచ్చిమొక్కలతో అధ్వానం...**

విద్యార్థుల కోసం అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టినప్పటికీ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. గోడలు నిర్మించినా స్లాబ్ వేయకపోవడంతో భవనాలు నిరుపయోగంగా మారాయి. నిర్మాణ ప్రదేశంలో పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా మారాయి. ప్లాస్టింగ్ చేయని గోడల మధ్య పాములు, తేళ్లు, ఎలుకలు సంచరిస్తుండటంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు.





**ఉపాధ్యాయుల కొరతతో చదువులకు ఆటంకం...**

51 మంది విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో బోధనపై తీవ్ర ప్రభావం పడుతోందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఐదు తరగతుల విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు బోధించాల్సి రావడంతో ప్రతి తరగతిపై తగినంత శ్రద్ధ చూపడం కష్టంగా మారిందని అంటున్నారు. డిప్యూటేషన్‌పై వచ్చే మరో ఉపాధ్యాయుడిపైనే అదనపు భారం పడుతోందని చెబుతున్నారు.

**విద్యార్థుల భద్రతపై ఆందోళన...**

పాఠశాల భవనం పూర్తికాకపోవడం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, విషపురుగులు సంచరించడం విద్యార్థుల భద్రతపై ఆందోళన కలిగిస్తోంది. చిన్నారులకు ఏదైనా ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి పాఠశాల పరిసరాలను పూర్తిస్థాయిలో శుభ్రం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

**తక్షణ చర్యలు చేపట్టాలి...**

విద్యార్థుల భద్రత, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పాఠశాలను పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అసంపూర్తిగా ఉన్న తరగతి గదుల నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, ఐదు తరగతులకు సరిపడా గదులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అలాగే 51 మంది విద్యార్థులకు అనుగుణంగా అదనపు ఉపాధ్యాయులను నియమించి, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ తదితర మౌలిక వసతులను మెరుగుపరచాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. చిన్నారులు ఇకపై చెట్ల కింద, వరండాలలో పాఠాలు వినే పరిస్థితి లేకుండా ప్రభుత్వం భవనం పూర్తి చేసి, ఉపాధ్యాయులను నియమించి పిల్లలకు మెరుగైన విద్య అందేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

- **ఎస్పై-2 రేవతి**

**మక్తల్, ఆగస్టు 22(జనంసాక్షి):** సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని మక్తల్ ఎస్పై-2 రేవతి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పై రేవతి మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు కొత్త పంథాల్లో ప్రజలను మోసగిస్తున్నారని హెచ్చరించారు. విద్యార్థులు ఇంటర్నెట్, సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమింగ్ యాప్స్ వాడే సమయంలో కనీస జాగ్రత్తలు పాటించాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, ఈ-మెయిల్లను గుడ్డిగా నమ్మకూడదని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీ, ఏటీఎం పిన్, సీవీవీ, బ్యాంక్ వివరాలను ఎవరికీ చెప్పవద్దు. ఉద్యోగాలు, ఉచిత బహుమతులు, స్కాలర్‌షిప్‌లు, ఆన్‌లైన్ గేమ్‌ల పేరుతో వచ్చే అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకూడదు.



ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఏమాత్రం భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను ఆశ్రయించాలని తెలిపారు. ఆర్థికపరమైన మోసాలు జరిగితే తక్షణమే కేంద్ర ప్రభుత్వ సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని వెల్లడించారు. అప్రమత్తత, నిరంతర అవగాహనతోనే సైబర్ నేరాలను అరికట్ట వచ్చని, విద్యార్థులు తమ ఇళ్లలో మరియు చుట్టుపక్కల వారికి కూడా ఈ విషయాలపై చైతన్యం తీసుకురావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, పోలీస్ సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## జనంసాక్షి కథనానికి స్పందన

- **గుంజేట్టిలో కరెంటు కష్టాలను తీర్చేందుకు అధికారుల చర్యలు**
- **క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించిన ఏడీ, ఏఈ**


గుంజేట్టి రైతులకు..
వేధిస్తున్న కరెంటు కష్టాలు



**న్యాల్‌కల్, ఆగస్టు 22 (జనంసాక్షి):** "గుంజేట్టి రైతులకు వేధిస్తున్న కరెంటు కష్టాలు"..శీర్షికన శనివారం ప్రచురించిన "జనం సాక్షి" కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. కథనాన్ని ప్రచురించిన రోజే నేరుగా క్షేత్రస్థాయికి వెళ్లి కరెంటు కష్టాలపై ఆరా తీశారు. శనివారం ఉదయం జహీరాబాద్ రూరల్ ఏడి మహేష్, న్యాల్ కల్ మండల విద్యుత్ అధికారి అర్జున్, స్థానిక విద్యుత్ సిబ్బంది, పలువురు రైతులతో కలిసి నేరుగా పరిశీలించారు.

# విద్యార్థుల భవిష్యత్తు కోసం విద్యా వాలంటీర్ల వ్యవస్థ

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 22 (జనంసాక్షి):** విద్యార్థులను సరైన మార్గంలో నడిపించడంలో సమాజంలోని ప్రతి ఒక్కరికీ బాధ్యత ఉందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తన సొంత నిధులతో నిర్వహిస్తున్న 'శతశాతం' కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టరేట్‌లో నూతనంగా నియమించిన విద్యా వాలంటీర్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పిల్లల చదువు, ప్రవర్తన, ఆలోచనా విధానం, పాఠశాల హాజరు, హోంవర్క్ తదితర అంశాలను విద్యా వాలంటీర్లు నిరంతరం గమనించాలని తెలిపారు. విద్యార్థుల సమస్యలు, ప్రతిభను ఉపాధ్యాయులతో పంచుకోవడం ద్వారా విద్యా వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని అన్నారు.

ఉపాధ్యాయులపై ఉన్న బోధన, సిలబస్, పరీక్షలు, నివేదికల వంటి అదనపు బాధ్యతల నేపథ్యంలో విద్యా వాలంటీర్ల వ్యవస్థ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. విద్యార్థులకు చిన్న వయస్సు నుంచే సబ్జెక్టులు, కాన్సెప్టులపై పట్టు కల్పించేందుకు 3డీ యానిమేషన్లు, డిజిటల్ లెర్నింగ్, యానిమేటెడ్ పుస్తకాలు, డిజిటల్ బోర్డులు వంటి ఆధునిక విధానాలను వినియోగిస్తున్నట్లు తెలిపారు.

**35 మందితో ప్రారంభమై 100 మందికి విస్తరణ...**

విద్యా వాలంటీర్ల కార్యక్రమాన్ని తొలుత 35 మందితో నిర్వహించి మంచి ఫలితాలు సాధించామని, ప్రస్తుతం 100 మంది వాలంటీర్లతో విస్తరిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. మహబూబ్‌నగర్‌లో ప్రారంభించిన ఈ మోడల్‌ను రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆదర్శంగా నిలపడం లక్ష్యమన్నారు. గ్రామీణ విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేస్తామని చెప్పారు.

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ విద్యా వాలంటీర్ల కార్యక్రమం అద్భుతమైనదని, విద్యాభివృద్ధికి ఎమ్మెల్యే చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఒక గ్రామం నుంచి ప్రారంభమయ్యే విద్యా విప్లవం జిల్లా, రాష్ట్రం, దేశ అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. మహిళలను విద్యా వాలంటీర్లుగా నియమించడం ద్వారా విద్యా వ్యవస్థ మరింత పటిష్టంగా, సురక్షితంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, డీఈఓ విజయకుమారి, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సినీ కవుల సింగిడిలి పుస్తకంలో సాయిసిరికి చోటు

**మెదక్ స్టోరీ, ఆగస్టు 22 (జనంసాక్షి):** తెలంగాణ సినీ కవుల జీవిత విశేషాలు; పాటల పదప్రయోగ విశ్లేషణను భవిష్యత్ తరాలకు తెలియజేయుట కోసం ; తెలుగు సినిమా చరిత్రను పరిశోధించే విద్యార్థులకు ఉపయోగపడే విధంగా అధికారికంగా తెలంగాణ సాహిత్య అకాడమీ లితెలంగాణ సినీ కవుల సింగిడిలి అనే 390 పేజీల పుస్తకాన్ని రూపొందించింది. ఈ పుస్తకంలో మెదక్ జిల్లాకు చెందిన సినీగీత రచయిత సాయిసిరికి చోటు లభించడం మెదక్ జిల్లాకు ప్రత్యేకం . ఈ పుస్తకంలో తెలంగాణ మొట్టమొదటి సినీ కవి చందాల కేశవదాసు నుంచి డాక్టర్ సి నారాయణరెడ్డి ; సుద్దాల అశోక్ తేజ; చంద్ర బోస్ ; గోరటి వెంకన్న; నందిని సిద్దారెడ్డి లాంటి మహామహుల సరసన మన మెదక్ జిల్లా ప్రధానోపాధ్యాయుడు ; సినీగీత రచయిత సాయిసిరి కి చోటు లభించడం పట్ల మెదక్ జిల్లా సాహితీవేత్తలు ; రచయితలు; ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ పుస్తకంలో సాయిసిరి రాసిన సినిమా పాటలను విశ్లేషిస్తూ సాయిసిరి జీవిత విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా సాయిసిరి మాట్లాడుతూ చరిత్రలో నాకంటూ కొన్ని పేజీలు తెలంగాణ సినీ కవుల సింగిడిలో స్థానం కల్పించినందుకు పుస్తక రచయిత డాక్టర్ తిరునగరి శరత్ చంద్ర గారికి; తెలంగాణ సాహిత్య అకాడమీ కి ; కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో రవీంద్రభారతిలో విడుదల చేయబోతున్న ఈ పుస్తకం భవిష్యత్ తరాలకు ; సినిమా చరిత్రపై పరిశోధన చేసే విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ పుస్తకంలో జై బోలో తెలంగాణలో పాటలు రాసిన మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావుకు ప్రత్యేక స్థానం కల్పించడం జరిగిందని రచయిత డాక్టర్ తిరునగరి శరత్ చంద్ర తెలిపారు.






# సాయుధ చైతన్య విద్యార్థుల ప్రతిభ ప్రశంసనీయం

**ఎర్రవల్లి, ఆగస్టు 22(జనంసాక్షి):** బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాయుధ చైతన్య పాఠశాల విద్యార్థుల ప్రతిభ ప్రశంసనీయమని, పదో బెటాలియన్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు టీజీఎస్పీ బెటాలియన్ ల అదనపు డీజీపీ సంజయ్ కుమార్ జైన్ తెలిపారు. శనివారం ఎర్రవల్లి మండల కేంద్రంలోని పదవ పోలీస్ బెటాలియన్ సాయుధ చైతన్య పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదులతోపాటు అతిథి గృహ భవన ప్రారంభోత్సవాలకు ముఖ్య అతిథిగా టీజీఎస్పీ బెటాలియన్ ల అదనపు డీజీపీ సంజయ్ కుమార్ జైన్ తో పాటు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు హాజరయ్యారు. ముందుగా అతిథులకు పోలీసుల గౌరవ వందనం అనంతరం పాఠశాల విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటుచేసిన సరస్వతీదేవి విగ్రహాన్ని అతిథులు ఆవిష్కరించి పూజలు నిర్వహించారు. అనంతరం నూతన తరగతి గదులను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు డీజీపీ సంజయ్ కుమార్ జైన్ మాట్లాడుతూ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం అన్ని వసతులతో, తక్కువ సమయంలోనే నిర్మించడం అభినందనీయమన్నారు. బెటాలియన్ లోని అధికారులు, సిబ్బంది అంకితభావం, కృషితోనే పాఠశాల అభివృద్ధి జరుగుతోందని, భవిష్యత్తులో కూడా ఇదే పని తీరు కనబరచాలని సూచించారు. పాఠశాల విద్యార్థులు డిజిటల్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని, రాష్ట్రస్థాయి టాపర్స్‌గా నిలిచేందుకు అత్యుత్తమ బోధన చేయాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా బెటాలియన్ పాఠశాలను అభివృద్ధి చేయడం, 20 ఏళ్లుగా పదవ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణులు కావడం గర్వకారణం అన్నారు. ప్రస్తుతం ఇక్కడ వెయ్యికి పైగా విద్యార్థులు విద్యను అభ్యసించడంతోనే ఈ పాఠశాల ప్రత్యేకత అర్థమవుతుందన్నారు.



తక్కువ సమయంలోనే అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తిచేసిన సిబ్బందిని ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా పాఠశాల మరింత అభివృద్ధి చెంది అత్యుత్తమ ఫలితాలు రావాలని ఆకాంక్షించారు. బెటాలియన్ లో అవసరమైన రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ హామీ ఇచ్చారు.ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ బెటాలియన్ అభివృద్ధికి ఎల్లవేళలా సహకరిస్తామని, ఇక్కడి సిబ్బంది శాంతి భద్రతలను కాపాడడంలో తమ వంతుగా కృషి చేస్తున్నారని కొనియాడారు. ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది కూడా అత్యవసర సమయంలో తమ సేవలందిస్తూ ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారన్నారు.అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ చూపిన పలువురు సిబ్బందికి అతిథులు ప్రశంసా పత్రాలు అందజేశారు. అంతకుముందు పాఠశాల అభివృద్ధిపై ప్రదర్శించిన పిపిటిని అతిథులు విద్యార్థులతో కలిసి తిలకించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ జయరాజ్, అదనపు కమాండెంట్లు పార్థసారధి రెడ్డి, వెంకటరమణ, పాఠి, డిఇఓ విజయలక్ష్మి, ఎంఈఓ అమీర్ పాష, పాఠశాల ప్రిన్సిపల్ శేషావలి, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధి పనులపై అధికారుల స్థల పరిశీలన


**అమీన్పూర్, ఆగస్టు 22 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా బీరంగూడ గుట్టపై ఉన్న శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి దేవస్థానం అభివృద్ధి పనులపై దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు శనివారం స్థల పరిశీలన చేశారు. దేవాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ శర్మ, అసిస్టెంట్ ఇంజనీర్ తులసీరామ్, అసిస్టెంట్ స్థపతి వెంకటేశ్వరరావు ఆలయాన్ని సందర్శించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి దేవనాదం, చైర్మన్ సుధాకర్ యాదవ్, పాలకమండలి సభ్యుల సమక్షంలో ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పనులకు అవసరమైన స్థలాలను పరిశీలించారు. ముఖ్యంగా శివుడి విగ్రహం ఏర్పాటు, 16 వసతి గృహాలు, హోమశాల, వేద పాఠశాల, సోలార్ వ్యవస్థ తదితర సౌకర్యాల ఏర్పాటుపై అధికారులతో చర్చించారు. ఆలయ భవిష్యత్ అవసరాలు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులకు సంబంధించిన తగిన ప్లానింగ్, ఎస్టిమేషన్లు, కొటేషన్లు సిద్ధం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అవసరమైన ప్రక్రియను పూర్తి చేసి అభివృద్ధి పనులను త్వరలోనే ప్రారంభించేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఆలయాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు భక్తులకు



మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను చేస్తామని ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జములమ్మ విగ్రహం ధ్వంసం చేసిన దుండగులు

**నర్వ, ఆగస్టు22 (జనంసాక్షి):** నర్వ మండల పరిధిలో పాతర్చేడ్ గ్రామంలో చెరువు కట్టపై వెలసిన జములమ్మ దేవాలయంలో ఉన్న జములమ్మ విగ్రహాన్ని గుర్తుతెలియని అగంతకులు ధ్వంసం చేయడం జరిగింది.ఈవిషయం పట్ల స్థానిక ప్రజలు,వివిధ గ్రామాల ప్రజలు ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరుతున్నారు.గ్రామంలో అత్యంత ఆరాధ్య దైవంగా పూజిస్తున్న జమ్ములమ్మ దేవాలయంలో ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం పట్లహిందూ మనోభావాలను దెబ్బతీసే విధంగా చేశారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



## పెన్షన్ దరఖాస్తులకు ఆగస్టు 31 చివరి తేదీ

- **పేట ఎంపీడీవో క్రాంతికుమార్**

**శంకరంపేట, ఆగస్టు 22 (జనంసాక్షి):** మండలంలో పెన్షన్‌కు దరఖాస్తు చేసుకోని అర్హులైన లబ్ధిదారులు ఆగస్టు 31లోపు సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శుల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో క్రాంతికుమార్ సూచించారు. వికలాంగుల ధ్రువీకరణ పత్రం లేని అర్హులు ఈ నెల 26న మెదక్‌లో నిర్వహించే సదరం శిబిరానికి హాజరై ధ్రువీకరణ పత్రం పొందాలని కోరారు. అర్హులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



## రాష్ట్రంలో ప్రజా పాలన కాదు.. దోపిడీ పాలన సాగుతోంది

- **బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు**

గద్వాల, ఆగస్టు 22 (జనం సాక్షి) జిల్లాలో 22ఏ నిషేధిత భూముల జాబితా రూపకల్పనలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ బీజేపీ నేతలు శనివారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో కొనసాగేది ప్రజా పాలన కాదు, దోపిడీ పాలన అని మండిపడ్డారు. 22ఏ నిషేధిత జాబితా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం భూ దోపిడీకి పాల్పడుతోందని ఆరోపించారు.
మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణ చెప్పారంటేనే స్కాం జరిగినట్లు ప్రభుత్వమే ఒప్పుకున్నట్లేనని అన్నారు. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న రైతులు, సామాన్యులు ఈ జాబితాతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

# ఎల్‌నినోతో ఎండుతున్న పంటలు.. ముఖం చాటేసిన వానలు నెర్రెలు బారుతున్న నేలలు

- **అట్టడుగుకు చేరుకుంటున్న భూగర్భ జలాలు**
- **వట్టి పోతున్న బోరు బావులు**

**హత్నూర, ఆగస్టు 22 (జనంసాక్షి):** ఖరీఫ్ పంటలపై ఎల్ నినో ప్రభావం తీవ్ర నష్టాన్ని మిగుల్చనుంది.వర్షం లేక ఎండిపోతున్న పంటలు చూసి రైతులు కన్నీళ్ళను దిగమింగుతున్నారు.వర్షాకాలం ప్రారంభం నుంచి ఆశించిన స్థాయిలో వానలు లేక చెరువులు,కుంటలు వట్టి పోయి దర్శనమిస్తున్నాయి. వర్షాలు ముఖం చాటేయడంతో నెర్రెలు బారిన పంట భూములు చినుకు స్పర్శ కోసం వేచి చూస్తున్నాయి. భూగర్భ జలాలు అడుగంటి నీరింకిన బోరు బావులు రైతుల వైపు చూస్తూ వాటి నిస్సహాయతను వ్యక్తపరుస్తున్నాయి.దీనికి తోడు కరెంటు కష్టాలు రైతుల కంటికి కునుకు లేకుండా చేస్తున్నాయి.ఓ వైపు తీవ్ర వర్షాభావం,మరోవైపు వట్టి పోతున్న బోరు బావులు దానికి తోడు విద్యుత్ కోతలు ఇలా రైతు శ్రమపై ముప్పేట దాడి చేస్తున్నాయి.పది మందికి అన్నంబెట్టే రైతన్న కళ్ళల్లో కన్నీటి సుడులు తిరుగుతున్నాయి.ఖరీఫ్ సాగు ప్రారంభంలో వ్యవసాయ నిపుణులు చేసిన హెచ్చరికలు రైతులు పెడచెవిన పెట్టారు.ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావం నెలకొనే ప్రమాదమున్న దృష్ట్యా రైతులు సాగు విస్తీర్ణం తగ్గించడంతో పాటు ఆరు తడి పంటలు వేసుకోవాలని పలు మార్లు సూచించినా రైతులు ఏ మాత్రం పట్టించుకోలేదు.అడపాదడపా కురిసిన వర్షాలకు మురిసిన రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమై వరి,పత్తి పంటలను విరివిగా సాగు చేశారు.ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి సాగు చేసిన పంటలు తమ కళ్ళముందే ఎండుముఖం పడుతున్న దృశ్యాలు చూసి కంట తడి పెడుతున్నారు.





**విద్యుత్ కోతలతో ఇబ్బందులు - రైతు ఆంజనేయులు**

విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వర్షాభావం కారణంగా బోరు బావుల్లో నీరు అడుగంటి పోతున్నాయి.విద్యుత్ కోతల కారణంగా ఉన్న ఆ కాస్త నీటిని పొలానికి పారించలేక పోతున్నాం.సంబంధిత అధికారులు స్పందించి అంతరాయం లేకుండా విద్యుత్ ను సరఫరా చేయాలి.

**ప్రభుత్వం ఆదుకోవాలి - అనిల్**

మాకు వ్యవసాయమే జీవనాధారం.పంట వేయనిదే బతుకుదెరువు లేదు.పంటలు పండేందుకు సరిపడా వర్షాలు పడకపోతాయా అనే ఆశతో పంటలు వేసుకున్నాం. కానీ వర్షాభావం కారణంగా వేసిన పంటలు ఎండుముఖం పడుతున్నాయి.ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.